ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
కృష్ణా జిల్లా వార్తలు
బుధవారం 16 ఏప్రిల్ 2025



10 వేల ఎకరాల భూ సమీకరణ!

ఇన్నర్, అవుటర్ రింగ్ రోడ్ల మధ్య సీఆర్‌డీఏ ఎంపిక

- ఎయిర్ పోర్టుకు 5 వేలు, స్మార్ట్ ఇండస్ట్రియల్ పార్క్‌కు 2,500, స్పోర్ట్స్ సిటీకి 2,500 ఎకరాలు
- గవర్నమెంట్ కాంప్లెక్స్ పనులు పూర్తయిన రెండేళ్లకు మరో 34 వేల ఎకరాల సమీకరణ
- మల్టీ కనెక్టివిటీ కోసమే.. ఇన్నర్, అవుటర్ మధ్య ప్రాంతం గుర్తింపు
- తుళ్లూరు మండలంలో అంతర్జాతీయ విమానాశ్రయం!
- ప్రపంచ బ్యాంకు సూచనల మేరకు భూములు తీసుకోవాలని నిర్ణయం



అమరావతికి దగ్గరగా ఇన్నర్, అవుటర్ రింగ్ రోడ్ల మధ్య ప్రాంతంలో ఉన్న 10 వేల ఎకరాల భూములను యుద్ధప్రాతిపదికన సమీకరించాలని సీఆర్‌డీఏ భావిస్తోంది. ఎండ్రాయి, కర్లపూడి, తాడికొండ, వైకుంఠపురంలోని భూములను టాప్-3 ప్రాధాన్యతా ప్రాజెక్టుల కోసం తీసుకోవాలని యోచిస్తోంది. అమరావతిలో అంతర్జాతీయ విమానాశ్రయానికి ఐదు వేల ఎకరాలు, స్మార్ట్ ఇండస్ట్రియల్ సిటీకి 2,500 ఎకరాలు, స్పోర్ట్స్ సిటీ కోసం 2,500 ఎకరాల చొప్పున తీసుకోవాలన్నది ఆలోచన. అవసరమైన భూములను తీసుకోవటానికి ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా అంగీకారం తెలిపినట్టు సమాచారం. మిగిలిన భూములను ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణం తర్వాత తీసుకోవాలని చూస్తున్నారు. అయితే భూ సమీకరణ విషయంలో రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అధికార వర్గాలు చెబుతున్నాయి.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): రాజధాని అమరావతిని పరిపాలనా కేంద్రంగానే కాకుండా సమాంతరంగా ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధించేలా చేయాలని కూడా రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తోంది. ప్రపంచ బ్యాంక్ సూచించిన విధంగా ఆర్థికాభివృద్ధిని తీసుకురావటానికి వీలుగా అంతర్జాతీయ విమానాశ్రయం, స్మార్ట్ ఇండస్ట్రియల్ సిటీ, స్పోర్ట్స్ సిటీలను అభివృద్ధి చేయాలని భావిస్తోంది. రాజధాని అమరావతి నిర్మాణానికి ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం వివిధ గ్రాంట్లతో కలిపి రూ.45 వేల కోట్లు ఖర్చు చేస్తోంది. ఇదికాకుండా బ్యాంకుల

మిగతా 6లో..

రెచ్చిపోయారు!

నందివాడ, పెదపారుపూడి మండలాల్లో మట్టి మాఫియా బరితెగింపు

గత శనివారం నుంచి సోమవారం వరకు సెలవులు రావడంతో యథేచ్ఛగా తోలకాలు

నందివాడ, పెదపారుపూడి మండలాల్లో మట్టి మాఫియా మరింత రెచ్చిపోతోంది. గత శనివారం నుంచి సోమవారం వరకు వరుస సెలవు దినాలు రావడంతో పగలు, రాత్రి అనే తేడా లేకుండా అక్రమ తవ్వకాలు జరిపింది. దూరాన్ని బట్టి ట్రాక్టర్ ట్రక్కు మట్టి రూ.1000 నుంచి రూ.1200 వరకు వసూలు చేసింది. అనుమతుల్లేకుండా సాగుతున్న ఈ దందాను ఎవరైనా అడ్డుకుంటే బెదిరింపులకు దిగుతోంది. అధికార పార్టీ నాయకులు, వైసీపీ నాయకులు కుమ్మక్కై.. ఈ వ్యవహారం నడపటంపై టీడీపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అక్రమాలను అడ్డుకోవాల్సిన రెవెన్యూ, డ్రైనేజీ అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారని విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

- అనుమతుల్లేవ్.. అడిగితే బెదిరింపులు
- అక్రమార్కుల్లో అధికార పార్టీ, వైసీపీ నాయకులు
- పట్టించుకోని రెవెన్యూ, డ్రైనేజీ శాఖ అధికారులు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఆయా మండలాల ప్రజలు

ఆంధ్రజ్యోతి - గుడివాడ: నందివాడ మండలం పెదలింగాల వద్ద ఆత్కూరు డ్రెయిన్ నుంచి మట్టిని యథేచ్ఛగా తరలించుకుపోయారు. గ్రామంలోని పలు ప్రైవేటు స్థలాలకు మెరక తోలుకున్నారు. టీడీపీ నాయకుడి కనుసన్నల్లో రామాపురంలోని చెరువు నుంచి మూడు రోజులుగా మట్టిని బయటకు తరలిస్తున్నారు. వెన్ననపూడి గ్రామ పంచాయతీ చెరువు నుంచి మట్టిదోపిడీ భారీస్థాయిలో సాగింది. చేదుర్తిపాడు పరిధిలో బుడమేరు నుంచి మట్టిని రాత్రి వేళ తరలించేస్తున్నారు. ఇంత జరుగుతుంటే అధికారులు మాత్రం తమకేమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఫిర్యాదులు అందినా రెవెన్యూ శాఖ, డ్రైనేజీ శాఖ అధికారులు స్పందించకపోవడం పలు అనుమానాలు తావిస్తోంది.

ఆత్కూరు డ్రెయిన్ నుంచి వైసీపీ నాయకుడి కనుసన్నల్లో..

గతంలో అధికారంలో ఉన్నప్పుడు వైసీపీ నాయకులు మట్టిని దోచేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా వారి హవానే సాగుతుందని టీడీపీ మండల నాయకులు ఆరోపిస్తున్నారు. నందివాడ మండలం పెదలింగాల వద్ద ఆత్కూరు డ్రెయిన్ నుంచి ఇష్టారాజ్యంగా మట్టిని తవ్వేస్తున్నారు. వైసీపీ ముఖ్య నాయకుడు దగ్గరుండి మట్టిని అక్రమంగా తరలించుకు పోతున్నా అధికారులు చోద్యం చూస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. పొలం గట్ల పటిష్టత పేరుతో వైసీపీ నాయకుడి ఆధ్వర్యంలో ఈ తతంగమంతా జరుగుతోంది.

నందివాడ మండలం రామాపురంలో మట్టి తరలింపు



క్షేత్రస్థాయిలో పరిశీలన ఏది?

మండలంలో మట్టి తవ్వకాలు, తోలకాలకు అనుమతులు లేవని నందివాడ తహసీల్దార్ వాట్సప్ సందేశాలను పంపడం ఆశ్చర్యానికి గురిచేసింది. ఆయా గ్రామస్తులు ఫొటోలతో సహ తహసీల్దార్‌కు సందేశాలు పంపితే, కనీసం క్షేత్రస్థాయిలో ఆర్.ఐ, వీఆర్‌వోలతో కలిసి దాడులు చేసి ప్రొక్లెయిన్, ట్రాక్టర్లు, టిప్పర్‌లను సీజ్ చేయాల్సి ఉంది. కానీ దానికి భిన్నంగా కార్యాలయంలో కూర్చొని సందేశాలు పంపడంపై మండల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ట్రాక్టర్ మట్టి రూ. 1000

ట్రాక్టర్ ట్రక్కు మట్టి రూ.1000 నుంచి రూ.1200 వరకు విక్రయిస్తున్నారు. మట్టిని తరలించే క్రమంలో దూరాన్ని బట్టి ధర పెంచుతున్నారు. అడ్డగోలుగా తవ్వుకుని అమ్ముకుంటుంటే అడ్డుకునే దమ్ము ఏ అధికారికీ లేదని అక్రమార్కులు సవాల్ విసురుతున్నారు.

మట్టి తోలకాలకు అనుమతులు లేవు : తహసీల్దార్

నందివాడ మండలంలోని ఏ గ్రామంలోనూ మట్టి తోలకాలకు అనుమతులు లేవని, తహసీల్దార్ కార్యాలయం నుంచి అనుమతులున్నట్లు ఎవరైన చెబితే రికార్డు చూపించమని అడగాలని నందివాడ తహసీల్దార్ గురుమూర్తి రెడ్డి వాట్సప్‌లో సందేశం పెట్టారు. ఇరిగేషన్, డ్రైనేజీ భూముల్లో కూడా మట్టి తవ్వకాలు జరుగకుండా ముందస్తుగానే వారికి తెలిపినట్లు పేర్కొన్నారు. కాగా, మట్టి అక్రమ తవ్వకాలను మంగళవారం మధ్యాహ్నం అధికారులు అడ్డుకోవడం గమనార్హం.

వరుస సెలవుల నేపథ్యంలో కుమ్మేశారు..

రెండో శనివారం, ఆదివారం, అంబేడ్కర్ జయంతి(సోమవారం)తో వరుసగా మూడు రోజులు సెలవులు రావడంతో అక్రమార్కులకు తిరుగే లేకుండా పోయింది. పగలు, రాత్రి తేడా లేకుండా మట్టి దోపిడీ చేసి సొమ్ము చేసుకున్నారు.

పెదపారుపూడిలోనూ ఇదే తంతు!

పెదపారుపూడి మండలం వానపాముల-వెంట్రప్రగడ పొలిమేరలోని ప్రభుత్వ పోరంబోకు పంట బోదె గట్లను రాత్రి వేళ అక్రమంగా తవ్వేస్తున్నారు. పంట బోదెలను అక్రమంగా తవ్వేయడంపై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వింజరంపాడులో విద్యుత్ టవర్ల నిర్మాణం కోసం తీసిన మట్టిని కొందరు అక్రమార్కులు తరలించుకుపోతున్నారు. మోపర్రు వద్ద బుడమేరులో నుంచి యథేచ్ఛగా మట్టిని తరలించేస్తున్నారు.

తాగుతున్నారు.. తన్నుకుంటున్నారు!

బార్‌ను తలపిస్తున్న పాతపాడు వైన్ షాపు



బార్‌లను తలదన్నేలా మద్యం షాపుల వద్ద ఏర్పాట్లు

నగర శివారు ప్రాంతాల్లోని మద్యం షాపుల వద్ద ఏర్పాటు చేసిన అనధికారిక పర్మిట్ రూముల్లో మందుబాబులు తప్పతాగి తన్నుకుంటున్నారు. దీంతో ఆయా పరిసర ప్రాంతాల్లో నిత్యం భయానక వాతావరణం నెలకొంటోంది. మద్యం అమ్మకాలు మాత్రమే జరపాల్సిన షాపుల నిర్వాహకులు వ్యాపారం పెంచుకునేందుకు చేసిన ఏర్పాట్లు గొడవలకు కారణమవుతున్నాయి. వీటిని అడ్డుకోవాల్సిన ఎక్సైజ్, పోలీసు అధికారులు ఆ వైపు కన్నెత్తి చూడకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది.



నున్నలో పాకతో పాటు బెంచీలు వేసి మరీ మద్యం తాగిస్తున్న వైన్ షాపు నిర్వాహకులు

- అనధికార పర్మిట్ రూముల్లో నిత్యం ఘర్షణలు
- భయానకంగా పరిసర ప్రాంతాలు
- పట్టించుకోని ఎక్సైజ్, పోలీసు అధికారులు

పాయకాపురం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): పాయకాపురం ప్రాంతంతో పాటుగా నున్న, పాతపాడు, అంబాపురం గ్రామాల పరిధిలో సుమారు ఆరు వరకు వైన్ షాపులు ఉన్నాయి. అయితే వీటిని చూసిన వారెవరూ వైన్ షాపులు అనుకోరు. బార్‌లను తలదన్నేలా ఇక్కడ కుర్చీలు, టేబుళ్లు, ఫ్యాన్లు సకల సదుపాయాలు ఉంటాయి. కేవలం వైన్ షాపుల్లో మద్యం మాత్రమే అమ్మకాలు జరపాల్సి ఉన్నా పక్కనే షెడ్లు వేసి మరీ మందుబాబులకు సోడాలు, స్టఫ్ వగైరాలు అందిస్తున్నారు. దీని వలన వైన్ షాపులే కాక సమీపంలోని రోడ్లు, పొలాలు కూడా తిరునాళ్లను తలపిస్తున్నాయి.

నిత్యం ఘర్షణలే!

స్థానిక వైన్ షాపుల వద్ద నిత్యం ఏదో ఒక ఘర్షణ జరుగుతూనే ఉంటోంది. రెండు రోజుల క్రితం ప్రకాష్‌నగర్ సెంటర్‌లోని ఓ వైన్ షాపులో కొందరు యువకులు ఫూట్‌గా మద్యం తాగి అకారణంగా మరో యువకుడిపై దాడి చేశారు. ఈ ఘటనలో గణేష్ అనే యువకుడు తల, మొహం, చేతి భాగాలకు తీవ్ర గాయాలయ్యాయి.



ప్రకాష్‌నగర్ వైన్ షాపులో జరిగిన గుర్తు తెలియని వ్యక్తుల దాడిలో గాయపడిన యువకుడు (ఫైల్)

- నున్న గ్రామంలోని ఓ వైన్ షాపులో వారం రోజుల క్రితం రెండు వర్గాలు బాహాబాహీకి దిగి రోడ్లపై తన్నుకున్నాయి. ఈ ఘటనలో ఓ వర్గంపై స్థానిక పోలీసులు కేసు కూడా నమోదు చేశారు. అదే రోజు మద్యం తాగిన మరో రెండు వర్గాలు తన్నుకున్నాయి. ఈ పంచాయితీ కూడా సంబంధిత స్టేషన్‌కు వచ్చింది. సదరు వైన్ షాపు పరిసర ప్రాంతాలు మొత్తం గాజు సీసాలు, గ్లాసులతో నిండిపోయి డంపింగ్ యార్డును తలపిస్తోంది.
- పాతపాడు వైన్ షాపు వద్ద పరిస్థితులు మరీ అధ్వానంగా ఉంటున్నాయి. ఇక్కడ ఏకంగా నిర్వాహకులు మూడు అనధికారిక పర్మిట్ రూమ్‌లను ఏర్పాటు చేసి మందుబాబులను

మిగతా 6లో..

12 మందికి కందుకూరి విశిష్ట పురస్కారాలు

నేడు తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ప్రదానం • నాటక రంగ కళాకారులకు అరుదైన గౌరవం

విజయవాడ కల్చరల్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): నాటక రంగ అభివృద్ధికి విశేషంగా సేవలందించిన కళాకారులను గౌరవించేందుకు ప్రభుత్వం ప్రతిష్ఠాత్మక కందుకూరి విశిష్ట పురస్కారాలను ప్రకటించింది. ఈ ఏడాదికి గాను రాష్ట్రస్థాయిలో ముగ్గురికి, జిల్లాస్థాయిలో 110 మందికి ఈ అవార్డులు దక్కాయి. రాష్ట్ర అవార్డు గ్రహీతలకు ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున, జిల్లాస్థాయి అవార్డు గ్రహీతలకు ఒక్కొక్కరికి రూ.10వేలు చొప్పున బహుమానాన్ని అందజేస్తారు. ఈ పురస్కారాల ఎంపికకు నాటకరంగ ప్రముఖులతో కమిటీని ప్రభుత్వం నియమించింది. బుర్రా సాయిమాధవ్ అధ్యక్షతన, గుమ్మడి గోపాలకృష్ణ, పాటిబండ్ల ఆనందరావు, చిక్కాల బాలాజీ, కేకేఎల్ స్వామి, బాలాజీ నాయక్, దాసరి చలపతిరావు (గంగోత్రి సాయి), జి.పద్మజ, బుద్దాల వెంకటరామారావు సభ్యులుగా ఉన్నారు. ఐఏఎస్ అధికారి హిమాన్షు శుక్ల సభ్యుడిగా, సమన్వయకర్తగా వ్యవహరించారు. పురస్కారాలను తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో బుధవారం ప్రదానం చేయనున్నారు. ఎన్టీఆర్ జిల్లా నుంచి శ్యామనపూడి వెంకటేశ్వరరావు, అగురు త్రినాథ్, వీర్ల వరప్రసాద్‌రావు, సుఖమంచి కోటేశ్వరరావు, హెచ్‌వీఆర్ఎస్ ప్రసాద్, బొర్రా నరేన్ ఎంపికయ్యారు. కృష్ణాజిల్లా నుంచి జొన్నలగడ్డ జగన్మోహన్‌రావు, బెత్తిన శివప్రసాద్, గాజులపల్లి కృష్ణ, బి.జయప్రకాష్, ఎస్.ఉదయభాస్కర్, తీట్ల రాజబాబును ఎంపిక చేశారు.

ట్రాక్టర్ పైనుంచి పడి బాలుడి మృతి

చల్లపల్లి, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): ఆడుకుంటూ ట్రాక్టర్‌పై నుంచి పడి బాలుడు మృతి చెందిన ఘటన చల్లపల్లి మండలం నిమ్మగడ్డలో మంగళవారం జరిగింది. నిమ్మగడ్డకు చెందిన నాగబాబు కుమారుడు గౌతమ్ (6) మంగళవారం సాయంత్రం స్నేహితులతో కలిసి కరకట్టకు వెళ్లే రోడ్డులో ఆడుకుంటూ.. అక్కడ ఖాళీ స్థలంలో నిలిపి ఉంచిన ట్రాక్టర్ ఎక్కాడు. తాళం తిప్పగానే ట్రాక్టర్ స్టార్ట్ అయి గేర్‌లో ఉండటంతో ముందుకు దూకింది. దీంతో ట్రాక్టర్‌పై కూర్చున్న గౌతమ్ వెనక్కి పడిపోవటంతో తలకు తీవ్రగాయమైంది. వెంటనే బాలుడిని చల్లపల్లి ప్రభుత్వాస్పత్రికి తీసుకువెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. దీంతో తల్లిదండ్రులు శోకసంద్రంలో మునిగారు.



గౌతమ్ మృతదేహం

దుర్గగుడి ఘాట్‌రోడ్డులో చోరీ

- కారులో ఉన్న 241 గ్రాముల బంగారం అపహరణ

6లో

గుడివాడ మున్సిపల్ కమిషనర్‌గా మనోహర్



గుడివాడ, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): గుడివాడ మున్సిపల్ కమిషనర్‌గా ఎస్.మనోహర్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. కాకినాడ మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వర్తిస్తున్న మనోహర్ ఇక్కడకు రానున్నారు. ప్రస్తుతం ఇక్కడ విధులు నిర్వర్తిస్తున్న బి.శ్రీనివాసరావు గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యదర్శిగా బదిలీ అయ్యారు.

ఎడ్యుకేషనల్ హబ్‌గా మచిలీపట్నం

- రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖా మంత్రి కొల్లు రవీంద్ర

8లో

మే 15 నుంచి బీచ్ కబడ్డీ, జలక్రీడలు

- విస్తృత ఏర్పాట్లపై శాప్ చైర్మన్ రవినాయుడు సమీక్ష

6లో

రైతులతో సయోధ్య!

విజయవాడ వెస్ట్ బైపాస్ వ్యవహారం కొలిక్కి!

- రైతులతో సమావేశమైన ఎమ్మెల్యే వసంత .. ప్రభుత్వ పెద్దల హామీల వివరాల వెల్లడి
- టవర్ల ఎత్తు పెంపునకు ఓకే, రెండుచోట్ల సింగిల్ టవర్ల ఏర్పాటు



(ఆంధ్రజ్యోతి, విజయవాడ): విజయవాడ వెస్ట్ బైపాస్ రోడ్డు వ్యవహారం ఓ కొలిక్కి వచ్చింది. ల్యాంకో అలైన్‌మెంట్ వ్యవహారంలో రైతులు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ, న్యాయస్థానాన్ని ఆశ్రయించి స్టేలను పొందిన సంగతి తెలిసిందే. దీంతో విజయవాడ వెస్ట్ బైపాస్ పనుల్లో స్తబ్దత నెలకొంది. ముఖ్యమంత్రి చంద్రబాబు ఇటీవల ఉన్నతాధికారుల సమావేశంలో బైపాస్ పనులను వేగంగా పూర్తి చేయటానికి చర్యలు తీసుకోవాల్సిందిగా సూచించారు. రైతులు కోర్టుకెళ్లిన అంశాలు కూడా ఈ సందర్భంగా ప్రధానంగా చర్చకు వచ్చాయి. రైతులతో మాట్లాడి వారి సమస్యలు ఏమిటో తెలుసుకుని వారు కోరుకున్న విధంగానే చర్యలు తీసుకుని సమస్యకు ఫుల్‌స్టాప్ పెట్టాలని సీఎం ఆదేశించారు. ఈ బాధ్యతలను మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్‌కు అప్పగించారు. వసంత కృష్ణ ప్రసాద్ ఇటీవల అమెరికా నుంచి తిరిగి వచ్చారు. జక్కంపూడి, నున్న, నైనవరం రైతులను పిలిపించి మాట్లాడారు. తొలగించాల్సిన లైన్‌కు సంబంధించి అలైన్‌మెంట్ మార్చటంపై రైతులు విస్మయం వ్యక్తం చేశారు. ఆ వివాదాల జోలికి మీరెళ్లవద్దని వసంత రైతులకు సూచించారు. ఆ వ్యవహారాలన్నీ న్యాయస్థానాల పరిధిలో ఉన్నందున.. అవి చూసుకుంటాయని స్పష్టం చేశారు. రైతుల పరంగా ఉన్న ఇబ్బందులేమిటని అడగ్గా.. అలైన్‌మెంట్ మార్చవద్దని, జక్కంపూడి దగ్గర టవర్లను ఎత్తు పెంచితే సరిపోతుందని.. ఎవరికీ ఇబ్బందులు లేవని తెలిపారు. దీనిపై ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ హామీ ఇచ్చారు. ఈ ప్రతిపాదనకు రాష్ట్ర ప్రభుత్వం కూడా సుముఖంగా ఉందని తెలిపారు. సాధారణ టవర్లు కాకుండా.. సింగిల్ టవర్లను రెండు చోట్ల ఏర్పాటు చేయాలని

మిగతా 6లో..

టాయ్ లైబ్రరీ!

23న సర్వోత్తమ గ్రంథాలయంలో ప్రారంభం

జూన్ 10 వరకు సాయంత్రం 4.00 నుంచి 6.00 గంటల వరకు..

నాలుగు నుంచి 12 ఏళ్ల వయస్సు వారి కోసం ఏర్పాటు

బెంజిసర్కిల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): చిన్నారుల్లో రోజురోజుకు తగ్గిపోతున్న పఠనాసక్తిని పెంచి గ్రంథాలయాల వైపు వారిని ఆకర్షితులను చేసేందుకు సర్వోత్తమ గ్రంథాలయం నడుం బిగించింది. బెంజిసర్కిల్‌లోని సర్వోత్తమ గ్రంథాలయ భవనంలో ఈ నెల 23వ తేదీన ప్రపంచ పుస్తక దినోత్సవం సందర్భంగా టాయ్ లైబ్రరీని ప్రారంభించనుంది. చిన్నారులు వేసవి సెలవుల్లో ఉల్లాసంగా... ఉత్సాహంగా గడిపేందుకు టాయ్ లైబ్రరీ దోహదపడుతుంది. ఇందులో చిన్నారుల కోసం 25 రకాల ఇన్‌డోర్ గేమ్స్‌ను ఉచితంగా టాయ్స్ రూపంలో ఉంచనున్నారు. డ్రాప్ గేమ్, సార్ట్ గేమ్, కలర్‌ఫుల్ గేమ్, గో ఫ్రాగ్గీ గో గేమ్, రైడ్ విత్ రామా, క్యాచ్ ఏ ఫిష్ తదితర మొత్తం 25 రకాల గేమ్స్‌ను అందుబాటులో ఉంచనున్నారు. ఈ టాయ్ లైబ్రరీలో ఈ నెల 23 నుంచి జూన్ 10వ తేదీ వరకు నాలుగు సంవత్సరాల నుంచి 12 ఏళ్ల వయస్సు ఉన్న చిన్నారులు ప్రతిరోజు సాయంత్రం 4.00 గంటల నుంచి 6.00 గంటల వరకు టాయ్స్‌తో ఆడుకోవచ్చు. మిగిలిన రోజుల్లో ప్రతి శనివారం, ఆదివారం సాయంత్రం 4.00 గంటల నుంచి 6.00 గంటల వరకు టాయ్ లైబ్రరీకి వచ్చి ఇన్‌డోర్ గేమ్స్‌ను ఆడుకోవచ్చు. కాగా, తల్లిదండ్రులు తమ పిల్లలను టాయ్ లైబ్రరీకి పంపి గ్రంథాలయాలకు వచ్చే అలవాటును పెంచాలని ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ రావి శారద ఈ సందర్భంగా కోరారు.



అధికారులతో సమీక్షిస్తున్న శాప్ చైర్మన్ రవినాయుడు

మే 15 నుంచి బీచ్ కబడ్డీ, జలక్రీడలు

» విస్తృత ఏర్పాట్లపై శాప్ చైర్మన్ రవినాయుడు సమీక్ష

విజయవాడ(స్పోర్ట్స్), ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : మంగినపూడిలో మే15 నుంచి 18వరకు మంత్రి కొల్లు రవీంద్ర పర్యవేక్షణలో జరిగే బీచ్ ఫెస్టివల్‌లో క్రీడాస్ఫూర్తి ప్రతిబింబించేలా జాతీయస్థాయి కబడ్డీ, జలక్రీడలను నిర్వహించాలని అధికారులకు శాప్ చైర్మన్ రవినాయుడు సూచించారు. శాప్ కార్యాలయంలో మంగళవారం వివిధ జిల్లాల డీఎస్డీవోలు, కబడ్డీ, కెనాయింగ్ అండ్ కయాకింగ్ అసోసియేషన్ల నిర్వాహకులతో క్రీడల నిర్వహణపై సమీక్షసమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, క్రీడాపోటీలను సమర్థవంతంగా, పక్కా ప్రణాళికతో నిర్వహించాలని, దానికోసం క్రీడా అసోసియేషన్లతో పాటు డీఎస్డీవోలందరూ సమష్టి కృషితో పనిచేయాలన్నారు. క్రీడాకారులకు మెరుగైన వసతులు కల్పించాలని సూచించారు. బీచ్ లో క్రీడాకోర్టులకు అనువైన ప్రాంతాలను తక్షణమే గుర్తించాలని, క్రీడా పరికరాలు, టెక్నికల్ టీమ్, కోచ్‌లు, రిఫరీలు, వలంటీర్లను సన్నద్ధం చేయాలని, ముఖ్యంగా ట్రాన్స్‌పోర్ట్, పోలీసింగ్, ఫైర్, మెడికల్ క్యాంపులపై దృష్టి సారించాలన్నారు. ఫెస్టివల్ విజయవంతానికి విస్తృత ప్రచారం చేయాలని అధికారులకు సూచించారు.

● క్రీడల్లో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి దేశఖ్యాతిని పెంపొందించడమే క్రీడాకారులు అజెండాగా పెట్టుకోవాలని, తద్వారా లక్ష్యాలను వేగంగా చేరుకోగలరని శాప్ చైర్మన్ రవినాయుడు అన్నారు. మంగళవారం తనను కలిసిన పలువురు క్రీడాకారులను శాప్ చైర్మన్ ప్రత్యేకంగా అభినందిస్తూ సత్కరించారు.

ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తులు

బెంజిసర్కిల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఆర్థిక రుణాల దరఖాస్తుకు ఆన్‌లైన్ సేవలు ప్రారంభమయ్యాయని అధికారులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మే 10 వరకు ఆన్‌లైన్‌లో లబ్ధిదారులు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. లబ్ధిదారుడు ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వారై కులధ్రువీకరణ పత్రం ఉండాలి. రాష్ట్రానికి చెంది ఉండి వయస్సు 21 నుంచి 50 మధ్య ఉండాలి. లబ్ధిదారుడు దారిద్ర్యరేఖకు దిగువన ఉండి, స్వయం ఉపాధి పథకాలకు సంబంధించి డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలి. జనరిక్ ఫార్మసీ పథకాలకు సంబంధిత ఫార్మసీ సర్టిఫికెట్లు ఉండాలి. ఆధార్, రేషన్, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, రవాణా కోసం డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలని అధికారులు తెలిపారు.

చంద్రబాబు ఆలోచనా విధానం మారాలి



» మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు

గాంధీనగర్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : రాజధాని విస్తరణకు మళ్లీ 44 వేల ఎకరాల భూసమీకరణ చేయాలని ప్రభుత్వం నిర్ణయించడాన్ని మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు తప్పుబట్టారు. ఇప్పటికే 58 వేల ఎకరాలు ఉండగా మరలా భూసేకరణ ఎందుకని ప్రశ్నించారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. సామాన్య ప్రజల అభివృద్ధిని విస్మరించి కార్పొరేట్ సంస్థలకు లబ్ధి చేకూరేలా వ్యవహరించడం వల్ల ప్రజల్లో అసంతృప్తి చెలరేగి మరలా రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే ప్రమాదం ఉందని హెచ్చరించారు. అదే జరిగితే రాష్ట్రం బీహార్ కంటే దారుణంగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రాధాన్యతా అంశాలపై చంద్రబాబు తన ఆలోచనా విధానాన్ని మార్చుకోవాలన్నారు. శ్రీకాకుళం ప్రజలకు కావాల్సింది సాగు, తాగునీరు, ఇరిగేషన్ ప్రాజెక్టులని.. విమానాశ్రయాలు కాదన్నారు. ఉద్దానంలో కిడ్నీ వ్యాధితో రోజుకు సగటున ఒకరు మృతి చెందుతున్నారని ఆ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 1996 నుంచి 2004 వరకు చంద్రబాబు పరిపాలన బాగుందని, ఆయన తీసుకున్న నిర్ణయాలు స్పష్టంగా ఉండేవని ఆ పరిస్థితి ప్రస్తుతం లేదని విమర్శించారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ

రెవెన్యూ సమస్యలపై దృష్టి పెట్టండి

» కృష్ణాజిల్లా కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూలో పెండింగ్ సమస్యల పరిష్కారానికి అధికారులు దృష్టిసారించాలని కలెక్టర్ బాలాజీ అన్నారు. రెవెన్యూ శాఖ జిల్లాస్థాయి సమావేశం మంగళవారం కలెక్టరేట్‌లో జేసీ గీతాంజలి శర్మతో కలిసి ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, భూముల లిటిగేషన్, 22-ఏ, ప్రైవేట్‌భూముల అసెస్‌మెంట్, ఆర్వోఆర్, వెబ్‌ల్యాండ్, రీసర్వే, నీటితీరువా తదితర అంశాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతుల అర్జీలు క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యలకు పరిష్కారం చూపాలన్నారు. డీఆర్వో కె.చంద్రశేఖరరావు, మచిలీపట్నం, గుడివాడ, ఉయ్యూరు ఆర్డీవోలు స్వాతి, బాలసుబ్రహ్మణ్యం హేలాషారోన్, కలెక్టరేట్ ఏవో ఆంజనేయప్రసాద్, తహసీల్దార్లు పాల్గొన్నారు.

జిల్లాలో పన్ను ఎగవేతదారులపై అధికారులు నిఘాఉంచాలని, కొందరు వ్యాపారులు పన్నులు చెల్లించకుండా అక్రమ మార్గాలను అనుసరిస్తున్నారని కలెక్టర్ అన్నారు. వాణిజ్యపన్నుల విభాగం అధికారులతో సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో పలువురు వ్యాపారులు పన్నులను ఎగవేస్తున్నారని, అలాంటి వారిని గుర్తించి పన్ను చెల్లింపుదారుల జాబితాలోకి తీసుకురావాలని ఆదేశించారు. రూ.40లక్షలకు పైగా లావాదేవీలు చేసే వ్యాపారులకు సంబంధించిన వివరాలను బ్యాంకులనుంచి సేకరించాలన్నారు. సమావేశంలో వాణిజ్యపన్నులశాఖ విజయవాడ డివిజన్ డెప్యూటీ కమిషనర్ కేపీ శైలజ, సహాయ కమిషనర్లు చిరంజీవి, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

అన్ని విద్యాసంస్థల్లో ఈగల్ క్లబ్స్

కలెక్టరేట్ : మాదకద్రవ్యాల రహిత ఎన్టీఆర్ జిల్లా సాకారానికి సమన్వయ శాఖలు, స్వచ్ఛంద సంస్థల సమష్టి కృషి అవసరమని, మాదకద్రవ్యాల దుష్పరిణామలపై అవగాహన కల్పించేందుకు మత్తు పదార్థాలు వినియోగిస్తున్న వారిని గుర్తించి, సక్రమ మార్గంలో నడిపించేందుకు అన్ని విద్యాసంస్థల్లో ఈగల్ క్లబ్‌లు ఏర్పాటయ్యేలా చూడాలని కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. నషా ముక్త్‌భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మాదకద్రవ్యాల నియంత్రణ, దుష్ప్రభావాలు, అవగాహన కార్యక్రమాల నిర్వహణ, కౌన్సెలింగ్ సేవలు తదితరాలపై మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్ అధ్యక్షతన సమన్వయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మత్తుపదార్థాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై పాఠశాలలు, కళాశాలల్లో, విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, ఇందుకు విద్యాసంస్థల్లో క్యాంపస్ అంబాసిడర్లను గుర్తించి, వారికి అవసరమైన శిక్షణ ఇవ్వాలన్నారు. కలెక్టర్ లక్ష్మీశ, సమన్వయ శాఖల అధికారులతో కలిసి ప్రచార పోస్టర్లను ఆవిష్కరించారు. సమావేశంలో జిల్లా విభిన్న ప్రతిభావంతులు, టీజీ, వయోవృద్ధుల సంక్షేమ అధికారి వాడ్రేవు కామరాజు, ఏసీపీ కె.వెంకటేశ్వరరావు, డీ అడిక్షన్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ స్వరాజ్యలక్ష్మి, డీఈవో యూవీ సుబ్బారావు, డీఎంహెచ్‌వో ఎం.సుహాసిని, జిల్లా వ్యవసాయ అధికారి డీఎంఎఫ్ విజయకుమారి, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.



అమరావతిలో రహదారులు..

రయ్.. రయ్!

» ఏడీసీఎల్ నేతృత్వంలో రాజధానిలో 38 ప్యాకేజీలతో అభివృద్ధి పనులు

» ఇప్పటివరకు 14 ప్యాకేజీలకు టెండర్లు ఖరారు


» విశాలమైన రోడ్లు, పచ్చటి చెట్లు, పూల సోయగాలు, పార్కుల అభివృద్ధి

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

అమరావతి అభివృద్ధి సంస్థ (ఏడీసీఎల్) నేతృత్వంలో రాజధానిలో మొత్తం 38 ప్యాకేజీలలో అభివృద్ధి పనులు చేపట్టాలని నిర్ణయించారు. వీటిలో ప్రస్తుతం 14 ప్యాకేజీలలో టెండర్లు పిలవటం జరిగింది. మిగిలిన 24 ప్యాకేజీల పనులు ఇంకా ప్రణాళిక దశలో ఉన్నాయి. ఏడీసీఎల్ పిలిచిన 14 టెండర్లకు సంబంధించి చూస్తే.. తొలి మూడు ప్యాకేజీలు వరద నియంత్రణకు సంబంధించి పనులు చేపడుతుండగా.. మిగిలినవన్నీ మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించి అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. రాజధానిలో నిర్మిస్తున్న రోడ్లన్నీ సువిశాలమైన ఆరు వరుసల రహదారుల స్థానంలోనే ట్రంక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పనులు కూడా కలిసి ఉన్నాయి. వీటిలో సైక్లింగ్ ట్రాక్, వాకింగ్ ట్రాక్, అవెన్యూ ప్లాంటేషన్ అభివృద్ధి, తాగు నీటి సదుపాయం కోసం వాటర్ సప్లై నెట్‌వర్క్, మురుగునీటి నిర్వహణ కోసం సీవరేజ్ నెట్‌వర్క్, ఎక్కడ పడితే అక్కడ విద్యుత్, ఇంటర్‌నెట్, కేబుల్ వైర్లు కనిపించకుండా భూగర్భంలోనే యుటిలిటీ డక్ట్స్ రీయూజ్ వాటర్ లైన్లు, స్ట్రీట్ ఫర్నిచర్ వంటివి చేపట్టాల్సి ఉంటుంది.

ప్యాకేజీల వారీగా ఖర్చు ఇలా..

ప్యాకేజి-7లో భాగంగా ఈ-6 రహదారి నిర్మాణం అంచనా వ్యయం రూ. 452.96 కోట్లు, ప్యాకేజి-8లో భాగంగా ఈ-8 రహదారి నిర్మాణం అంచనా వ్యయం రూ. 522.92 కోట్లు, ప్యాకేజి-9లో భాగంగా ఎన్-11 రహదారి నిర్మాణం అంచనా వ్యయం రూ. 419.85 కోట్లుప్యాకేజి-10లో భాగంగా ఈ-9 రహదారి నిర్మాణం అంచనా వ్యయం రూ.490.87 కోట్లు, ప్యాకేజి-11లో భాగంగా ఈ-14 రహదారి నిర్మాణం అంచనా వ్యయం రూ.350.07 కోట్లు, ప్యాకేజి-12లో భాగంగా ఎన్-12 రహదారి నిర్మాణం అంచనా వ్యయం రూ. 614.56 కోట్లు, ప్యాకేజి-13లో భాగంగా ఎన్-6 రహదారి నిర్మాణం అంచనా వ్యయం రూ.232.86 కోట్లు, ప్యాకేజి-14లో భాగంగా ఈ-5 రహదారి నిర్మాణం అంచనా వ్యయం రూ. 807.75 కోట్లతో నిర్మించేందుకు ఏడీసీఎల్ టెండర్లు పిలవటం జరిగింది. ఇవికాకుండా ప్యాకేజి-4 పనులకు నిర్మాణ వ్యయం రూ.522.39 కోట్లు, ప్యాకేజి-5 పనులకు నిర్మాణ వ్యయం రూ.98.17 కోట్లు, ప్యాకేజి-6లో భాగంగా ముఖ్యమైన మౌలిక సదుపాయాలతో ఎన్-15 రహదారి నిర్మాణ వ్యయం రూ.482.12 కోట్లతో చేపట్టేందుకు టెండర్లు పిలిచింది.



పచ్చదనం అభివృద్ధి..

రాజధానిలో పచ్చదనం అభివృద్ధికి ఒక్కో రహదారికి రూ.5 కోట్ల చొప్పున మొత్తం 35 రోడ్లకు గాను రూ.175 కోట్లను ఖర్చు చేయాలని ఏడీసీఎల్ నిర్ణయించింది. అమరావతిలో రోడ్లపై సెంట్రల్ డివైడర్‌తో పాటు రెండు వైపులా అత్యద్భుతమైన పూల మొక్కలు కనిపించేలా ఆకర్షణీయంగా తీర్చిదిద్దనున్నారు. అమరావతిలో రూ.25 కోట్ల వ్యయంతో ఆధునిక థీమ్ పార్కులను నిర్మించటానికి సీఆర్‌డీఏ సన్నద్ధమౌతోంది.

ఇసుక కొరత రానీయకండి

» స్టాక్ యార్డ్‌ల్లో 10 లక్షల మెట్రిక్ టన్నుల నిల్వలు సిద్ధం చేయాలి

» సరఫరాలో అలసత్వం వహించే ఏజెన్సీలను బ్లాక్‌లిస్టులో పెడతాం

» ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : ప్రజావసరాలను, రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని జిల్లాలో వున్న ఇసుక స్టాక్ యార్డ్‌ల్లో 10 లక్షల మెట్రిక్ టన్నుల నిల్వలను సిద్ధం చేసి, కొరతకు తావులేకుండా చర్యలు తీసుకోవాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ సంబంధిత అధికారులు, ఏజెన్సీ ప్రతినిధులను ఆదేశించారు. జిల్లాలో ఇసుక సరఫరా, నిల్వలపై మంగళవారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో జిల్లాస్థాయి సమావేశం నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, ఉచిత ఇసుక విధానాన్ని పారదర్శకత, జవాబుదారీతనాన్ని పాటిస్తూ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. రాజధాని పనులు వేగవంతం కావడంతో చుట్టుపక్కల గ్రామాలతో పాటు జిల్లావ్యాప్తంగా ప్రజలు నిర్మాణ పనులను చేపట్టడం జరిగిందన్నారు. ప్రజావసరాలను దృష్టిలో పెట్టుకొని రానున్న వర్షాకాలంలో ఇసుక కొరత లేకుండా స్టాక్ యార్డుల్లో 10లక్షల మెట్రిక్ టన్నుల నిల్వలను సిద్ధంగా వుంచాలన్నారు. జిల్లాలోని అలూరుపాడు, ఏటూరు, కంచెల్ల, కీసర, ఇబ్రహీంపట్నం వద్ద వున్న స్టాక్ యార్డుల్లో ఇసుక నిల్వలను వుంచేలా అధికారులు, సరఫరా ఏజెన్సీలు సమన్వయంతో చర్యలు తీసుకోవాలన్నారు. మే 31వ తేదీ నాటికి పూర్తిస్థాయిలో ఇసుక నిల్వలు వుంచాలన్నారు. ఇందుకుగాను ప్రతి రోజు 200లకు పైగా లారీలు ఇసుకను స్టాక్ పాయింట్‌లకు సరఫరా చేయాల్సి వుంటుందన్నారు. స్టాక్ పాయింట్ వద్ద ఇసుక నిల్వలను సంబంధిత తహసీల్దార్లు ప్రతిరోజు పర్యవేక్షించి నివేదిక సమర్పించాలన్నారు. జిల్లాలో రావిరాల, మల్కాపురం, ఏటూరు, మున్నలూరు, సైదాపురం, గని ఆత్కూరు, దాములూరు ప్రాంతాల్లో మరో ఏడు రీచ్‌లను గుర్తించడం జరిగిందని ఆయా రీచ్‌ల్లో ఇసుకను సేకరించేలా పర్యావరణ అనుమతులకు ప్రతిపాదనలు పంపాలని మైనింగ్ అధికారులకు కలెక్టర్ సూచించారు. స్టాక్ యార్డులలో ఇసుక సరఫరా, నిల్వల వివరాలు ప్రదర్శించడంతో పాటు ఆన్‌లైన్‌లో ఉంచాలన్నారు. ఇసుక స్టాక్ పాయింట్లలో ఎటువంటి అనధికార కార్యకలాపాలను నిర్వహిస్తున్నట్టు తన దృష్టికి వస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదన్నారు. ఇటీవల అధిక వర్షం కారణంగా జగ్గయ్యపేట ప్రాంతంలో రైతుల భూముల్లో వరద నీరు ప్రవేశించి ఇసుక మేటలు వేయడం జరిగిందని, వాటిని తొలగించేందుకు క్షేత్రస్థాయిలో పర్యటించి సాధ్యాసాధ్యాలను పరిశీలించి నివేదికను సమర్పించాలని నందిగామ రెవెన్యూ అధికారి ఎం.బాలకృష్ణను కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో గనులశాఖ డీడీ ఎ.శ్రీనివాసరావు, ఏడీ కె.వీరాస్వామి, ఆర్ఐ కె.శ్రీనివాస్, టెక్నికల్ అసిస్టెంట్ కె.ఖ్యాతి, ఎం.బాబురావు, నందిగామ ఆర్డీవో కె.బాలకృష్ణ, వత్సవాయి, చందర్లపాడు, నందిగామ, కంచికచర్ల, ఇబ్రహీంపట్నం తహసీల్దార్లు పాల్గొన్నారు.

ఉల్లాస్ లక్ష్యాలపై దృష్టి పెట్టండి

» మే 5 నుంచి సెప్టెంబరు వరకు అక్షరాస్యత కార్యక్రమాలు



కలెక్టరేట్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : పదిహేనేళ్లకు పైబడిన వారిలో నిరక్షరాస్యులను గుర్తించి, వారిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దడంతో పాటు ఆర్థిక అక్షరాస్యత, డిజిటల్ అక్షరాస్యత పెంపొందించేందుకు ఉద్దేశించిన ఉల్లాస్ (అండర్‌స్టాండింగ్ లైఫ్‌లాంగ్ లెర్నింగ్ ఫర్ ఆల్ ఇన్ సొసైటీ) కార్యక్రమ లక్ష్యాలపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఉల్లాస్ కార్యక్రమ అమలుపై కలెక్టర్ అధ్యక్షతన పాఠశాల, వయోజన విద్య, డీఆర్‌డీఏ, గ్రామ-వార్డు సచివాలయాలు, ఐసీడీఎస్, సమాచార, పౌరసంబంధాల శాఖ అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఉల్లాస్ పథకం లక్ష్యాల సాధనకు అధికారులు కృషిచేయాలని సూచించారు. నిరక్షరాస్యులైన స్వయం సహాయక సంఘాల సభ్యులతో పాటు ప్రభుత్వ పాఠశాలల్లోని ఆయాలు, కుక్‌లు, హెల్పర్లు, నైట్ వాచ్‌మెన్లు, అంగన్వాడీ సహాయకులు తదితరులను గుర్తించి, అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని ఆదేశించారు. ఉల్లాస్ కార్యక్రమం కింద ఈనెల 16 నుంచి ఆరురోజుల పాటు సర్వేచేసి నిరక్షరాస్యులను గుర్తించాలని ఆదేశించారు. జిల్లాస్థాయిలో మండల అధికారులకు, మండల స్థాయిలో వాలంటీర్ ఉపాధ్యాయులకు శిక్షణ అనంతరం మే 5వ తేదీ నుంచి సెప్టెంబరు వరకు అక్షరాస్యత కార్యక్రమాలు మొదలవుతాయన్నారు. సమావేశంలో ఉల్లాస్ నోడల్ అధికారి జి.ప్రసాదరావు, డీఈవో యూవీ సుబ్బారావు, ఐసీడీఎస్ పీడీ డి.శ్రీలక్ష్మి, గ్రామ, వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి జి.జ్యోతి, డీఆర్‌డీఏ పీడీ ఏఎన్‌వీ నాంచారరావు తదితరులు పాల్గొన్నారు.

22 వరకు పోషణ్ పఖ్వాడా

కలెక్టరేట్ : ఈనెల 8 నుంచి 22 వరకు నిర్వహించనున్న 7వ పౌష్టికాహార పక్షోత్సవం (పోషణ్ పఖ్వాడా) సందర్భంగా స్పెషల్ డ్రైవ్ కింద అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని కలెక్టర్ లక్ష్మీశ సమన్వయ శాఖల అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో కలెక్టర్ లక్ష్మీశ వివిధ శాఖల అధికారుల తో కలిసి పోషణ్ పఖ్వాడా పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చిన్నారులు, మహిళల్లో ఆరోగ్యకరమైన, పోషకాలతో కూడిన ఆహారాన్ని ప్రోత్సహించడం ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు. గ్రామ, వార్డు సచివాలయ స్థాయిలో ప్రత్యేక బృందాలు ఇంటింటినీ సందర్శించాలని, పోషకాహారంపై ర్యాలీలు, సమావేశాలు తదితరాలను నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు.

ప్రతి బంగారు కుటుంబానికి బాసట

» ఆర్థిక, సామాజిక అభివృద్ధికి ప్రణాళికలు

» సమగ్ర సమాచారం ఆధారంగా రూపకల్పనకు కసరత్తు

» కీలక ప్రక్రియల్లో జిల్లా అధికారుల పాత్ర కీలకం : కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పీ4 సర్వే ఆధారంగా గుర్తించిన ప్రతి బంగారు కుటుంబానికి ఆర్థిక, సామాజిక అభివృద్ధి ప్రణాళిక రూపకల్పనకు కృషిచేయడం జరుగుతోందని, ఇందులో భాగంగా గ్రామ, వార్డు సచివాలయ స్థాయిలో సమాచారాన్ని సేకరించడంలో జిల్లాస్థాయి, క్షేత్రస్థాయి అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. బంగారు కుటుంబాలు-మార్గదర్శుల అనుసంధానం, బంగారు కుటుంబాల ఆర్థిక, సామాజిక అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనకు తీసుకోవాల్సిన చర్యలపై కలెక్టర్ లక్ష్మీశ మంగళవారం ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి దార్శనికతకు అనుగుణంగా పీ-4 విధానం అమల్లో భాగంగా గుర్తించిన బంగారు కుటుంబాల సమగ్రాభివృద్ధికి మార్గదర్శులతో అనుసంధానం చేయాల్సిన అవసరముందని ప్రతి బంగారు కుటుంబ స్థితిగతులు, అందుబాటులో వున్న వనరులు, ప్రస్తుతం ప్రభుత్వం నుంచి అందుతున్న సహాయం, మార్గదర్శుల నుంచి అవసరమయ్యే వనరుల మద్దతు తదితరాలతో ప్రతి బంగారు కుటుంబానికి స్వల్పకాలిక, మధ్యకాలిక, దీర్ఘకాలిక ప్రణాళికలను రూపొందించి, అమలు చేయాల్సిన అవసరముందన్నారు. ఈ నేపథ్యంలో తొలిదశలో గుర్తించిన సచివాలయాల పరిధిలోని 2,260 బంగారు కుటుంబాల్లో గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది ప్రతి బంగారు కుటుంబాన్ని సందర్శించి 18 అంశాలకు సంబంధించిన సమాచారాన్ని తీసుకోవాలని, వీటి ఆధారంగా అధికారులు నివేదికలు రూపొందించి, సమర్పించాలన్నారు. డీఎల్‌డీవోలు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు దీనిపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని, ప్రక్రియను సమర్థవంతంగా పర్యవేక్షించాలని ఆదేశించారు. తర్వాతి దశలో తలసరి ఆదాయం (పీసీఐ), జిల్లా స్థూల రాష్ట్రీయోత్పత్తి (జీడీడీపీ), ప్రతి రంగంలోనూ స్థూలవిలువ జోడింపు (జీవీఏ)లో వృద్ధికి ప్రణాళికాయుత చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ వివరించారు. సమావేశంలో గ్రామ, వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి జి.జ్యోతి, విజయవాడ, తిరువూరు డీఎల్‌డీవోలు హాజరయ్యారు.

మునేటిలో మునిగి బాలుడు మృతి



మృతుడు శివ సాయికృష్ణారెడ్డి

నందిగామ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): అప్పటి వరకూ స్నేహితులతో సరదాగా ఆడుకుంటున్న బాలుడు మునేటిలో దిగి మృతి చెందిన ఘటన నందిగామలో చోటుచేసుకుంది. సేకరించిన సమాచారం ప్రకారం.. పట్టణానికి చెందిన సాంబుల శివసాయి కృష్ణారెడ్డి(10) స్థానిక పాఠశాలలో 6వ తరగతి చదువుతున్నాడు. మంగళవారం పాఠశాల నుంచి ఇంటికి వస్తూ స్నేహితులతో కలిసి ఆడుకుంటూ మునేటి వద్దకు వెళ్లాడు. నలుగురు విద్యార్థులు నీటిలోకి దిగారు. మునేటిలో ఇసుక గుంతలో శివసాయి కృష్ణారెడ్డి పడిపోగా మిగిలిన ముగ్గురు కేకలు వేయడంతో స్థానికులు హుటాహుటిన అక్కడకు చేరుకొని శివసాయి కృష్ణను నందిగామ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అప్పటికే బాలుడు మృతి చెందినట్టు వైద్యులు ధృవీకరించారు. బాలుడి తండ్రి రామకృష్ణారెడ్డి ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. బాలుడి మృతి ఆ ఇంట తీవ్ర విషాదాన్ని నింపింది.

చెరువులో పడి ..

పామర్రు : మంచినీటి చెరువులో మునిగి వ్యవసాయ కూలీ మృతిచెందిన ఘటన జుజ్జవరంలో చోటుచేసుకుంది. మచిలీపట్నం-విజయవాడ ప్రధాన రహదారి పక్కన జుజ్జవరం గ్రామ పంచాయతీ మంచినీటి చెరువులో ప్రమాదవశాత్తు పడి గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీ దనికొండ నాంచారయ్య (60) మంగళవారం దుర్మరణం చెందాడు. మృతుడికి భార్య ఉన్నారు.

రైతులతో సయోధ్య!

(5వ పేజీ తరువాయి)

రైతులు కోరగా.. ఎమ్మెల్యే దీనికి కూడా అంగీకరించారు. దీంతో రైతులు తాము సహకరిస్తామని చెప్పారు. దీంతో సమస్య పరిష్కారమైంది. ల్యాంకో లైన్ వివాదంలో ఉన్న సంగతి తెలిసిందే. దీని పనులు ఎవరు చేస్తారన్నది ఆసక్తిగా ఉంది. సహజ న్యాయసూత్రం పరంగా చూస్తే ల్యాంకో లిక్విడేటర్ దీనికి ప్రస్తుతం బాధ్యతగా ఉన్నారు. ఈ లైన్‌ను కొన్న మయన్మార్ కంపెనీ పూర్తిగా ల్యాంకో లిక్విడేటర్‌కు డబ్బులు చెల్లించకపోవటంతో .. అది యజమాని కాదు. రాధా అనే సంస్థకు దీనికి ఎలాంటి సంబంధం లేదు. ఇలాంటపుడు సింగిల్ టవర్లను ఏ సంస్థ ద్వారా చేయిస్తారన్నది ఆసక్తికరంగా మారింది.

భూ సమీకరణ!

(5వ పేజీ తరువాయి)

నుంచి, ఇతర ఆర్థిక సంస్థలు కలిపి మొత్తంగా మరో రూ.55 వేల కోట్ల వరకు నిధులు సమీకరించాలని భావిస్తోంది.

విమానాశ్రయంతో సత్వర ఆర్థికాభివృద్ధి!

రాజధాని నగరంలో సత్వర ఆర్థికాభివృద్ధి సాధించే ప్రాజెక్టుల్లో అంతర్జాతీయ విమానాశ్రయం ప్రధానమైంది. దీనివల్ల వ్యాపార, వాణిజ్యాభివృద్ధి జరుగుతుంది. మల్టీనేషన్ కంపెనీల కార్యాలయాలు, కర్మాగారాలు ఏర్పాటు చేయటానికి దోహదపడుతుంది. ఎగుమతి, దిగుమతులను పెంపొందిస్తుంది. విమానాశ్రయం వల్ల మౌలిక సదుపాయాలు కూడా గణనీయంగా అప్‌గ్రేడ్ అవుతాయి. రోడ్లు, పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్, స్మార్ట్‌సిటీ ప్రాజెక్టులు వంటివి అభివృద్ధి చెందుతాయి. కార్గో, లాజిస్టిక్ హబ్‌గా, పండ్లు, పూలు, ఔషధాల ఎగుమతులకు దోహదపడుతుంది. స్థానికంగా రియల్ ఎస్టేట్ కూడా వృద్ధి చెందుతుంది. భూములు 300 నుంచి 500 శాతం వరకు పెరుగుతాయన్నది అంచనా. అమరావతిలో అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ఐదు వేలఎకరాల్లో ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు.

స్మార్ట్ ఇండస్ట్రియల్ సిటీతో అనేక ప్రయోజనాలు

టెక్నాలజీ ఆధారిత పారిశ్రామిక నగరాన్ని స్మార్ట్ ఇండస్ట్రియల్ సిటీ అంటారు. ఇందులోని పరిశ్రమలు డిజిటల్‌గా ఇంటిగ్రేట్ అయి ఉంటాయి. ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐవోటీ) ద్వారా ఉత్పాదకతను పెంచడం, గ్రీన్ ఎనర్జీ అంటే సౌర, పవన శక్తి, వేస్ట్ మేనేజ్‌మెంట్ పరిశ్రమలు ఉంటాయి. అలాగే, ఇవన్నీ కూడా రోడ్లు, రైల్వేస్టేషన్, విమానాశ్రయానికి అనుసంధానం (మల్టీమోడల్ కనెక్టివిటీ)గా ఉంటాయి. స్మార్ట్ ఇండస్ట్రియల్ సిటీ వల్ల భారీ ఎత్తున పెట్టుబడులను ఆకర్షించవచ్చు. తద్వారా ఉద్యోగాల సృష్టి ఎక్కువగా జరుగుతుంది. స్థానిక ఆర్థిక వ్యవస్థకు మంచి ప్రోత్సాహం ఇస్తుంది. అందుకే ఈ ప్రాజెక్టు కోసం 2,500 ఎకరాలను సమీకరించాలని నిర్ణయించింది.

స్పోర్ట్స్ సిటీ ప్రాజెక్టుతో పర్యాటక రంగ అభివృద్ధి

స్పోర్ట్స్ సిటీ ప్రాజెక్టుకు కూడా భూములను సమీకరించాలని నిర్ణయించింది. స్పోర్ట్స్ సిటీ వల్ల కూడా అమరావతి సత్వరాభివృద్ధికి దోహదపడుతుంది. స్పోర్ట్స్ సిటీ అనేది క్రీడలు, ఫిట్‌నెస్, వినోద కేంద్రంగా ఉంటుంది. ప్రపంచ స్థాయి క్రీడా స్టేడియాలు, ట్రైనింగ్ అకాడమీలు, స్పోర్ట్స్ మ్యూజియాలు, ఫిట్‌నెస్ సెంటర్లు, హోటళ్లు రిటైల్ మాల్స్, ఎంటర్‌టైన్‌మెంట్ జోన్లు, ఆటగాళ్లు, కోచ్‌ల రెసిడెన్షియల్ జోన్లు ఉంటాయి. ఈ స్పోర్ట్స్ సిటీ వల్ల కూడా పర్యాటక రంగం, రియల్ ఎస్టేట్ బూమ్, స్థానిక వ్యాపారం పెరగటం, ఉద్యోగాల కల్పన పెద్ద ఎత్తున జరుగుతుంది.

అవుటర్, ఇన్నర్ రింగ్ రోడ్ల మధ్య ప్రాంతం పరిశీలన

ఈ మూడు ఎకనమిక్ బూస్ట్ ప్రాజెక్టులకు ఇన్నర్, అవుటర్ రింగ్ రోడ్ల మధ్యన భూములు సమీకరిస్తేనే సార్థకత ఉంటుందని ప్రభుత్వం భావిస్తోంది. మల్టీ మోడల్ కనెక్టివిటీ సాధించాలంటే.. ఈ ప్రాంతమే మంచిదని యోచిస్తోంది. అమరావతి నూతన రైల్వే లైను కూడా మంజూరైన సంగతి తెలిసిందే. ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం నుంచి అమరావతి మీదుగా నంబూరు వరకు రైల్వేలైన్ వెళ్తుంది. దీనికోసం 800 ఎకరాలు సేకరించాల్సి ఉంటుంది. ఈ భూములను కూడా అమరావతిలో వైకుంఠపురం, ఎండ్రాయి, కర్లపూడి, తాడికొండ గ్రామాల్లో సేకరించాల్సి ఉంటుంది. సీఆర్‌డీఏ ద్వారా ఇక్కడి భూములను సమీకరించి ఆ తర్వాత కేంద్ర ప్రభుత్వానికి ఇచ్చే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోంది. ఎయిర్‌పోర్టు కోసం భూములు ఎక్కడ తీసుకోవాలన్న దానిపై ఇంకా స్పష్టత లేదు. ఎయిర్‌పోర్టు ఎక్కడ ఏర్పాటు చేయాలన్న దానిపై ఏఏఐ అధికారులతో చర్చించాక కానీ ఓ స్పష్టత రాదు. ఎయిర్‌పోర్టు అవసరాల కోసం తుళ్లూరు మండలంలోని వడ్డమాను, పెద్దపరిమి, హరిశ్చంద్రపురం, తాడికొండ మండలంలోని మోతడక గ్రామాల్లో భూ సమీకరణ ద్వారా భూములను తీసుకోవాలనుకుంటున్నారు.

మరో 30 వేల ఎకరాలపై దృష్టి

అమరావతిలో గవర్నమెంట్ కాంప్లెక్స్ పనులన్నీ పూర్తయ్యాక రాజధాని విస్తరణ ప్రక్రియను ప్రారంభించాలన్నది ప్రభుత్వ ఆలోచన. గవర్నమెంట్ కాంప్లెక్స్ పనుల్లో ఐకానిక్ టవర్లు మినహా మిగిలినవన్నీ రెండేళ్లలో పూర్తవుతాయి. మిగిలిన 30 వేల ఎకరాలను రియల్ ఎస్టేట్ డెవలప్‌మెంట్ కార్యక్రమాల కోసం, అనేక భాగస్వామ్య సంస్థలకు కేటాయించేందుకు వీలుగా సమీకరించాలన్న ఆలోచన జరుగుతోంది. దేశంలోనే పేరెన్నికగన్న రియల్ ఎస్టేట్ అండ్‌డెవలపింగ్ సంస్థలను కూడా ఇప్పటికే ఆహ్వానించారు.ఇలాంటి ఆర్థికాభివృద్ధి కార్యక్రమాల న్నిం టికీ అవసరమైన భూములను సమీకరించాలని, నిధులను కూడా సమీకరించాలని ప్రభుత్వం భావిస్తోంది.

తాగుతున్నారు..

(5వ పేజీ తరువాయి)

ఆకర్షించేందుకు బల్లలు, ఫ్యాన్లు కూడా ఏర్పాటు చేశారు. ఇక్కడ మద్యం తాగడానికి వచ్చే వారి వాహనాలతో కండ్రిక, పాతపాడు రోడ్డు తిరునాళ్లను తలపిస్తోంది.

● అంబాపురం పంచాయతీ పరిధిలోని పైపుల రోడ్డు వద్ద ఉన్న వైన్ షాపు వద్ద రోజు ఘర్షణ వాతావరణమే కనిపిస్తోంది. గత నెల పాయకాపురం శాంతినగర్‌కు చెందిన రెండు వర్గాలు బాహాబాహీకి దిగి బీరుబాటిళ్లతో దాడులు చేసుకున్నాయి. ఇదే ఘటనలో ఓ యువకుడు తన ద్విచక్రవాహనం నుంచి కత్తిని తీసి హల్‌చల్ చేయడంతో ఇన్నర్ రింగ్ రోడ్డపై ప్రయాణికులు సైతం హడలిపోయారు. ఇది జరిగిన వారానికి మద్యం తాగడానికి వచ్చిన కొందరు స్నేహితులు మద్యం మత్తులో రెండు వర్గాలుగా విడిపోయి ఒకరిపై ఒకరు భీకరంగా దాడులు చేసుకున్నారు.

మామూళ్ల మత్తులో అధికారులు!

మద్యం షాపుల వద్ద ఇంత జరుగుతున్నా సంబంధిత ఎక్సైజ్, పోలీస్ శాఖల అధికారులు మాత్రం తమకు ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఐదు నెలలుగా ఈ తతంగం జరుగుతున్నా అధికారులకు తెలియకపోవడం గమనార్హం. షాపుల నిర్వాహకులే సీసీ కెమెరాలు పెట్టి మరీ మద్యం తాగించడం ఇక్కడ విశేషం. అదే సీసీ కెమెరాల ఫుటేజ్‌లు తీసుకుని మరీ ఘర్షణలు పడినవారిపై పోలీసులు కేసులు నమోదు చేయడం మరో విశేషం. సీసీ కెమెరాల్లో స్పష్టంగా మద్యం తాగిస్తున్నట్లు కనిపిస్తున్నా అవేమి పట్టించుకోకుండా కేవలం కేసుల నమోదుకు మాత్రమే సీపీ ఫుటేజ్‌లను వాడుకోవడం గమనార్హం.

షాపుల వద్ద మద్యం తాగిస్తే చర్యలు : ఎక్సైజ్ సీఐ శ్రీనివాసరెడ్డి

వైన్ షాపుల వద్ద మద్యం తాగకూడదని బోర్డులు ఏర్పాటు చేశాం. నిబంధనలకు విరుద్ధంగా వైన్ షాపుల నిర్వాహకులు మద్యం తాగిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటాం.

దాళ్వా ధాన్యం మొత్తం కొనుగోలు చేస్తాం

వణుకూరు (కంకిపాడు), ఏప్రిల్ 15 : దాళ్వా ధాన్యం మొత్తం కొనుగోలు చేస్తామని డీఎస్ఎం రమాదేవి రైతులకు హామీ ఇచ్చారు. పెనమలూరు మండలంలోని వణుకూరులో మంగళవారం ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని దళారులకు తక్కువ ధరకు విక్రయించాల్సిన అవసరం లేదన్నారు. రైతు సేవా కేంద్రాల ద్వారా ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకే విక్రయించాలని సూచించారు. రైతుల నుంచి సేకరించిన ధాన్యం లోడును జెండా ఊపి ఆమె ప్రారంభించారు. రైతులు, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.


రైతులతో మాట్లాడుతున్న డీఎస్ఎం పద్మాదేవి

క్యాబేజి రైతు కుదేలు!

- కుళ్లు తెగులుతో చేతికిరాని పంట
- దున్నేస్తున్న రైతులు
- రూ. లక్షల పెట్టుబడి మట్టిపాలు


చినఓగిరాలలో కుళ్లు తెగులుతో పాడైపోయిన క్యాబేజి

(ఉయ్యూరు - ఆంధ్రజ్యోతి)

క్యాబేజి పంటకు కుళ్ల తెగులు సోకి పంట పాడైపోతున్న పరిస్థితుల్లో రైతులు ఆందోళన చెందుతున్నారు. లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టి సాగుచేసిన పంట చేతికొచ్చే తరుణంలో కుళ్లతెగులు సోకడంతో కొనే వారులేక రైతులు నష్టపోతున్న పరిస్థితులు నెలకొన్నాయి. చినఓగిరాల, ఆకునూరు, గండిగుంట, పెద ఓగిరాల గ్రామాల పరిధిలో షుమారు వంద ఎకరాల్లో క్యాబేజి పంట సాగు చేయగా పంట చేతికి రాకుండా కుళ్ల తెగులు సోకి పక్వానికి రాకుండా మొక్కలు ఎండిపోతుండటంతో రైతుల కంట కన్నీరు వస్తుంది. ఇదిలా ఉండగా తెగులుతో పాటు కలుపు మొక్కలు కూడా పెరిగి పంట పైకిరానివ్వక పోవడంతో కలుపు నివారణకు పెద్దమొత్తంలో ఖర్చు చేసినప్పటికి ఫలితం లేక రైతులు ఆశలు వదులుకుని చేతులెత్తేశారు. ఈ ఏడాది క్యాబేజికి మార్కెట్‌లో ధరలేక ఓవైపు పండించిన రైతులు ఇబ్బంది పడుతుంటే మరోవైపు ఇతర రాష్ట్రాల నుంచి క్యాబేజి దిగుమతి అవడం కూడా ఈ ప్రాంత క్యాబేజి రైతులకు కోలుకోలేని పరిస్థితి ఏర్పడింది. లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టి పండించిన పంట చేతికి రాకపోడంతో చేసేది లేక పంటను రొటోవేటర్లతో దున్నివేస్తున్నారు.

కలుపు మందుకే లక్షపైన ఖర్చు



రెండున్నర ఎకరాల్లో క్యాబేజి సాగుచేస్తే పంట చేతికొచ్చే తరుణంలో కుళ్ల తెగులు సోకి మొక్కలు ఎండిపోయా యి. తెగులుతో పాటు కలుపు కూడా ఉధృతంగా రావడంతో ఎన్ని మందులు పిచికారీ చేసినా ఫలితంలేక పంట దున్ని మరో పంట వేసుకోవలసిన పరిస్థితి. కలుపు మందుకే లక్ష పైగా ఖర్చు చేశాను.
-యెనిగళ్ల కుటుంబరావు, చినఓగిరాల


సెంట్రింగ్‌ను తొలగించిన మునిసిపల్ సిబ్బంది

అనధికార నిర్మాణం కూల్చివేత

పెనమలూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : తాడిగడప మునిసిపాలిటీలోని కానూరులో నిర్మాణంలో ఉన్న భవనానికి అక్రమంగా ఏర్పాటు చేసిన సెంట్రింగ్‌ను మునిసిపల్ టౌన్‌ప్లానింగ్ అధికారులు మంగళవారం తొలిగించారు. మునిసిపాలిటీలో అనుమతులు లేకుండా నిర్మించే నిర్మాణాలను ఉపేక్షించేదిలేదని కమిషనర్ భవానీప్రసాద్ హెచ్చరించారు.

టీడీపీ వీరవల్లి గ్రామాధ్యక్షుడిగా లంక సురేంద్ర మోహన బెనర్జీ


అధ్యక్షుడు మోహన బెనర్జీతో అజయ్

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ బలోపేతానికి అందరినీ కలుపుకుంటూ, యువతను ప్రోత్సహిం చేందుకు తన వంతు సహకారం అందిస్తానని లంక సురేంద్ర మోహన బెనర్జీ అన్నారు. వీరవల్లి లో మంగళవారం తెలుగురైతు రాష్ట్ర కార్యదర్శి గుండపనేని ఉమా వరప్రసాద్ పర్యవేక్షణలో గ్రామ కమిటీ ఎన్నిక నిర్వహించారు. లంక సురేంద్ర మోహ న బెనర్జీని అధ్యక్షుడిగా, అజయ్‌ను కార్యదర్శిగా, 8మంది సభ్యులతో కూడిన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్ర మంలో కలపాల రాజా బాబు, పిల్లా రామా రావు, మండాది రవీంద్ర, తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

హనుమాన్‌జంక్షన్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మంగళవారం హనుమాన్‌జంక్షన్ అగ్నిమాపక అధికారి రామ్మోహన్ రావు అధ్యర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. జంక్షన్ ఆర్టీసీ బస్టాండ్, పలు విద్యా సంస్థలు, సూపర్ బాజర్‌ల్లో కరపత్రాలు పంపిణీ చేశారు. అగ్నిప్రమాదాలు సంభవించినపుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.


మొక్కను నాటుతున్న రాణా వెల్ఫేర్ సొసైటీ సభ్యుడు షేక్ జాకీర్‌హుస్సేన్

పుట్టినరోజు.. పచ్చని చెట్టు

● కార్యక్రమానికి రాణా వెల్ఫేర్ సొసైటీ శ్రీకారం

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : భవిష్యత్తు తరాలకు స్వచ్ఛమైన గాలి, నీరు అందించేలా పర్యావరణ పరిరక్షణకు రాణా వెల్ఫేర్ సొసైటీ ద్వారా పుట్టిన రోజున..పచ్చని చెట్టు అనే కార్యక్రమం నిర్వహిస్తున్నామని వ్యవస్థాపక అధ్యక్షుడు సుంకర సాంబశివరాయల్ అన్నారు. కానుమోలులో రాణా వెల్ఫేర్ సొసైటీ ఏలూరు అధ్యక్షుడు షేక్ జాకీర్ హుస్సేన్ తన పుట్టిన రోజు సందర్భంగా సభ్యులతో కలిసి మంగళవారం మొక్కను నాటారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఇప్పటి వరకూ 700పైగా మొక్కలు పంపిణీ చేశామని, ఇక నుంచి మొక్కలు నాటేందుకు ప్రత్యేకంగా పుట్టిన రోజున పచ్చని చెట్టు నిర్వహిస్తామని సాంబశివరామల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రణవ్, పీవీ సురేష్, తదితర సభ్యులు పాల్గొన్నారు.


ఆసుపత్రిని ప్రారంభించి మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, ఎస్పీ గంగాధర్‌రావు

గ్రామీణ ప్రాంతాల్లో నాణ్యమైన వైద్యసేవలు

ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి) : ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలందించేందుకు పీపీపీమోడ్‌లో 100పడకల ఆసుపత్రులను నిర్మించాలనే ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల కార్యాచరణ జరుగుతున్నదని ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. ఎస్.ఎన్.పాలెంలో ఓ ఆసుపత్రిని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావుతో కలిసి ఆయన మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాబోయే రోజుల్లో 100 నుంచి 300 పడకల ఆసుపత్రిని ప్రతి నియోజకవర్గంలో ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి సూచన మేరకు క్షేత్రస్థాయిలో పరిశీలన జరిగిందన్నారు. ప్రభుత్వం ద్వారా ప్రైవేటు, ప్రభుత్వ ఆసుపత్రిలో పేదలకు అత్యాధునిక వైద్యసేవలందించేలా ప్రభుత్వ పీపీపీ మోడల్‌లో కృషి చేస్తుదన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, ఎస్పీ గంగాధర్‌రావు, మెడివ్యాలీ చైర్మన్ పంచకర్ల వరప్రసాద్, రమేష్ చక్రవర్తి, కూటమి నాయకులు అధికారులు పాల్గొన్నారు.

ట్రామాకేర్ సెంటర్ ఏర్పాటు చేయాలి : ఎమ్మెల్యే యార్లగడ్డ

అత్యధిక కిలోమీటర్ల జాతీయ రహదారి, మల్లవల్లి పారిశ్రామికవాడ అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో అత్యవసర వైద్య సేవలకు ట్రామాకేర్ సెంటర్ ఏర్పాటు చేయాలని మంత్రి సత్యకుమార్‌యాదవ్‌కు ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు విజ్ఞప్తి చేశారు. పేదలకు నాణ్యమైన వైద్యం అందించేందుకు వీలుగా నియోజవర్గ కేంద్రం గన్నవరంలో 100పడకల ఆసుపత్రిని ఏర్పాటు చేయాలని ఆయన కోరారు.


ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

కృషితో ర్యాంకులు సాధ్యమే

గన్నవరం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : కృషి పట్టుదల ఉంటే ఉత్తమ ర్యాంకులు సాధించడం సాధ్యమని వీకేఆర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు అన్నారు. ఇంటర్‌లో ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థుల అభినందన కార్యక్రమం మంగళవారం కళాశాలలో జరిగింది. తల్లిదండ్రుల సమక్షంలో టాపర్లుగా నిలిచిన 30 మంది విద్యార్థులను దుశ్శాలువాలతో ప్రిన్సిపాల్, అధ్యాపకులు ఘనంగా సత్కరించారు. అనంతరం మాట్లాడుతూ, విజయవాడ, ఏలూరు మధ్యలో ఉన్న ఏకైక ప్రభుత్వ ఎయిడెడ్ కళాశాల వీకేఆర్ కళాశాల అని చెప్పారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు తేజాకుమారి, ప్రమీల, దుర్గా భవాని, క్రాంతి, ఉష శ్రీ, జాషువా, చిన్నారి, ఏసుబాబు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా నాయకులు సూరగాని సాంబశివరావు

మినుములను ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

గన్నవరం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు తెరిచి మినుములను క్వింటాలు రూ.10వేలకు కొనుగోలు చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా నాయకులు సూరగాని సాంబశివరావు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక సంఘ కార్యాలయంలో మండలస్థాయి సమావేశం జరిగింది. కొలుసు శ్రీమన్నారాయణ అధ్యక్షత వహించారు. సాంబశివరావు మాట్లాడుతూ, ప్రస్తుతం మినుమును కమీషన్ వ్యాపారులు క్వింటా రూ.7వేలకు కొనుగోలు చేస్తామని అంటున్నారని, ప్రభుత్వం క్వింటాకు రూ.10వేలు చెల్లించి కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలన్నారు. ఈ సమావేశంలో సంఘ నాయకులు అవుటపల్లి సాంబయ్య, నక్క రామారావు, నల్లూరి ధర్మారావు పాల్గొన్నారు.

రైలుకింద పడి యువకుడి ఆత్మహత్య

ఉంగుటూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలోని పొట్టిపాడు రైల్వేగేటు సమీపంలో రైలుకిందపడి గుర్తుతెలియని ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. సోమవారం రాత్రి ఈ ఘటన జరిగింది. ఏలూరు నుంచి విజయవాడ వైపు వెళ్తున్న రైలు అతని తలను ఖండించి మొండెంను వేరుచేయడంతో మృతి చెందాడు. రైల్వే కీమాన్ ప్రభాకర్ ద్వారా సమాచారం అందుకున్న ఏలూరు రైల్వే ఎస్సై పి.సైమన్ మంగళవారం ఉదయం తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని, మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి వద్ద ఎటువంటి ఆధారాలు లభ్యంకాకపోవడంతో మృతదేహాన్ని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించి మార్చురీలో భద్రపరిచామని, మృతుడి అడ్రస్, వివరాలు తెలిసిన వారు తన ఫోన్‌నెంబర్ 9988219559లో సంప్రదించాలని సూచించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు.


గండిగుంట పొలాల్లో మట్టినమూనా సేకరిస్తున్న వ్యవసాయ అధికారులు

భూసార పరీక్షలతో నేలకు మేలు

ఉయ్యూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : భూసర పరీక్షలు చేయించి నేలను కాపాడుకుందామని జిల్లా వ్యవసాయ అధికారి మనోహర్ అన్నారు. గండిగుంట రైతుసేవాకేంద్రంలో మంగళవారం పెనమలూరు, పమిడిముక్కల, ఉయ్యూరు మండలాల గ్రామ వ్యవసాయ సహాయకులు, ఉద్యాన నాయకులకు మట్టిన మూనా సేకరణపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పొలాల్లో మట్టి సేకరించే విధానాలను తెలియచేసి అన్ని గ్రామాల పొలాల్లో మట్టి నమూన సేకరించేలా చూడాలన్నారు. వేసవిలో పంటలు క్రాప్ బుకింగ్ చేయించుకునేలా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. పంట వ్యర్థాలను తగల బెట్టడం వలన భూసారం తగ్గడంతో పాటు, పర్యావరణానికి హాని కలుగుతుందని గన్నవరం ఏడీఏ ఎం సునీల్ తెలిపారు. డీడీఏ డీఆర్‌సీ కె జ్యోతిరమణి, అధికారులు పార్థసారథి, కె శ్రీనివాసరావు, బి పద్మజ మండల వ్యవసాయ అధికారులు నిస్సీగ్రేస్, గణేశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

న్యాయవ్యవస్థలో పనిచేయడం అదృష్టం

● జిల్లా ప్రధాన న్యాయాధికారి అరుణసారిక

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : ఎంతో పురాతనమైన మచిలీపట్నం బార్ అసోసియేషన్‌తో అనుసంధానమైన కృష్ణాజిల్లా కోర్టులో పని చేయడం తన అదృష్టంగా భావిస్తున్నట్లు జిల్లా జడ్జి ఎస్. అరుణసారిక అన్నారు. మచిలీపట్నం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం బదిలీపై చిత్తూరు జిల్లాకు వెళుతున్న అరుణసారిక, విశాఖపట్నం జిల్లా జడ్జిగా బదిలీ అయిన చిన్నంశెట్టి రాజు, 10వ అదనపు జిల్లా జడ్జి సరికొండ చినబాబుకు మచిలీపట్నం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా వీడ్కోలు సభ నిర్వహించారు. మచిలీపట్నం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బూరగడ్డ అశోక్‌కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో న్యాయమూర్తులు ముగ్గురిని ఘనంగా సన్మానించారు. అనంతరం మచిలీపట్నం బార్ అసోసియేషన్ సభ్యుడు లంకిశెట్టి సాయిఫణిసంతోష్‌ను బార్ సభ్యులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ కార్యదర్శి ఎస్.ఎస్.ఎస్. సాయిబాబు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

సారా నిర్మూలనే నవోదయం లక్ష్యం

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాల్లో నాటుసారా వల్ల కలిగే దుష్పరిణామాలను వివరిస్తూ సారా రహితంగా తీర్చిదిద్దుతూ, అర్హులైన వారికి ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించేలా చర్యలు చేపట్టడమే నవోదయం 2.0 కార్యక్రమ లక్ష్యమని ఎక్సైజ్ సీఐ సురేఖ అన్నారు. మడిచర్ల, కొయ్యూరు గ్రామాల్లో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా మంగళవారం సారా విక్రయాల నివారణపై అవగాహన సదస్సు కళాజాతా నిర్వహించారు. కళాకారుల బృందం పాటల రూపంలో సారా వల్ల కలిగే అనర్థాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్సై చందా అల్లూరయ్య, ఉయ్యూరు ఎస్సై ఎన్. కల్యాణి, టీడీపీ మండల కార్యదర్శి పుట్టా సురేష్, మోటూరి శ్రీనివాస్, డీసీ చైర్మన్ దేవినేని సత్యనారాయణ, కొయ్యూరు సర్పంచ్ కొల్లి వీరవెంకట సత్యనా రాయణ, కాండ్రు అజయ్‌కుమార్, తూమాటి సాంబశివరావు పాల్గొన్నారు.


సారా దుష్పరిణామాలపై అవగాహన కల్పిస్తూ కళాజాతా నిర్వహిస్తున్న ఎక్సైజ్ సీఐ సురేఖ, ఎస్సై అల్లూరయ్య, కళ్యాణి తదితరులు


బాపులపాడు పీహెచ్‌సీలో వసతి భవనం లేక ఆరుబయటే రోగులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

ఆరుబయటే వైద్యసేవలు!

వైసీపీ పాలనలో పూర్తికాని బాపులపాడు పీహెచ్‌సీ భవనం

హనుమాన్‌జంక్షన్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : పేదలకు వైద్యం అందించే బాపులపాడు పీహెచ్‌సీకి సరైన వసతి భవనం లేకపోవడంతో ఇబ్బందిగా మారింది. గత వైసీపీ ప్రభుత్వ పాలనలో పీహెచ్‌సీ భవన నిర్మాణం చేపట్టారు. నేటికి పూర్తి చేయకపోవడంతో వైద్య సిబ్బంది, వైద్యసాయం కోసం వచ్చే రోగులు ఇబ్బంది పడుతున్నారు. పీహెచ్‌సీ భవనం నిర్మాణం చేపట్టిన నేపథ్యంలో సదరు కాంట్రాక్టరుకు గత ప్రభుత్వం బిల్లులు చెల్లించపోవడంతో పనులు నిలిచిపోయాయి. హోమియో వైద్యశాల కోసం నిర్మించిన చిన్న భవనంలో గత ఐదేళ్లుగా పీహెచ్‌సీని నిర్వహిస్తున్నారు. చిన్న భవనంలోనే రోగులను పరీక్షించి మందులు ఇవ్వడం, అక్కడే రక్తపరీక్షలు నిర్వహించడంతో ఒక చిన్నపాటి స్టోరు రూంలా పీహెచ్‌సీ తలపిస్తోంది. వైద్యసాయం కోసం వచ్చే రోగులు ఆరుబయటే వేచి ఉండాల్సిన దుస్థితి నెలకొంది. కూటమి ప్రభుత్వమైన స్పందించి పీహెచ్‌సీ భవనం నిర్మాణం పూర్తి చేసి రోగులు, సిబ్బందికి ఇబ్బంది లేకుండా చూడాలని కోరుతున్నారు.


సీసీ రోడ్డుకు భూమిపూజ నిర్వహిస్తున్న కూటమి నాయకులు

గ్రామాల్లో మౌలిక సౌకర్యాల కల్పనకు కృషి

హనుమాన్‌జంక్షన్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో మౌలిక సౌకర్యాల కల్పనకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని టీడీపీ బాపులపాడు మండల అధ్యక్షుడు దయాల రాజేశ్వరరావు అన్నారు. ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు మార్గద ర్శకత్వంలో 15వ ఆర్థిక సంఘం నిధులతో మంగళవారం బాపులపాడు కృష్ణా నగర్‌లో సీసీ రోడ్డు నిర్మించతలపెట్టారు. టీడీపీ జంక్షన్ పట్టణ అధ్యక్షుడు అట్లూరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కూటమి నాయకులు పూజలు నిర్వహించి రోడ్డు నిర్మాణం పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ దుట్టా శివన్నారాయణ, తెలుగు మహిళా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మూల్పూరి సాయికల్యాణి, గార్లపాటి రాజేశ్వరరావు, తోట మురళీధర్, కొల్లి బుజ్జి, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

అభయాంజనేయ స్వామి ప్రత్యేక పూజలు

హనుమాన్‌జంక్షన్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : స్థానిక అభయాంజనేయ స్వామి ఆలయంలో స్వామి వారి జన్మనక్షత్రాన్ని పురస్కరించుకొని మంగళవారం ప్రత్యేకపూజలు ఘనంగా నిర్వహించారు. ఆలయ ఈవో పి.తారకేశ్వరరావు పర్యవేక్షణలో ప్రధాన అర్చకులు మారేపల్లి సీతారామానుజాచార్యులు, అర్చకులు పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.



అమ్మవారికి కానుకగా నెక్లెస్‌ను సమర్పిస్తున్న దాత కుటుంబ సభ్యులు.

దుర్గమ్మకు 30 గ్రాముల బంగారు నెక్లెస్

ఇంద్రకీలాద్రి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : లండన్‌లో స్థిరపడిన తెలుగు కుటుంబానికి చెందిన వి.సీతారామిరెడ్డి పేరిట మంగళవారం ఆయన కుటుంబ సభ్యులు విచ్చేసి 30.500 గ్రాముల బంగారు నెక్లెస్‌ను దుర్గమ్మకు కానుకగా సమర్పించారు. దాత కుటుంబ సభ్యులకు అమ్మవారి దర్శనం కల్పించి, వేద పండితుల ఆశీస్సులు అందజేశారు. అధికారులు లడ్డూ ప్రసాదం, శేషవస్త్రం, అమ్మవారి చిత్రపటం బహూకరించారు.

అన్న వితరణకు రూ.1.60 లక్షల విరాళం



అనంతపురం జిల్లా రుద్రంపేటకు చెందిన వి.నందిని కుటుంబ సభ్యులతో మంగళవారం దుర్గగుడిలో నిత్యాన్నదాన పథకానికి రూ. 1,60,000లను విరాళంగా అందజేశారు. దాతకు, కుటుంబీకులకు అధికారులు అమ్మవారి దర్శనం కల్పించి, వేద పండితుల ఆశీస్సులు అందజేశారు. లడ్డూ ప్రసాదం, శేషవస్త్రం, అమ్మవారి చిత్రపటం బహూకరించారు.



నీలిమకు గిన్నిస్ వరల్డ్ రికార్డు సర్టిఫికెట్

విజయవాడ కల్చరల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : శ్రీదుర్గామల్లేశ్వర సిద్ధార్థ మహిళా కళాశాలలో సీనియర్ ఇంటర్ విద్యార్థిని పి.నీలిమ కూచిపూడి నృత్యంలో గిన్నిస్ వరల్డ్ రికార్డ్ పార్టిసిపేషన్ సర్టిఫికెట్ సాధించింది. 2023లో భారత్ ఆర్ట్స్ అకాడమీ తెలంగాణలో నిర్వహించిన కూచిపూడి నృత్యంలో పాల్గొన్న 4218 మందిలో నీలిమ ఒకరు. గిన్నిస్ రికార్డు సర్టిఫికెట్ నీలిమకు రావడం కళాశాలకు గర్వకారణమని ప్రిన్సిపాల్ ఎస్.పద్మజ తెలిపారు. సిద్ధార్థ అకాడమీ అధ్యక్షుడు ఎం.రాజయ్య, సెక్రటరీ పి.లక్ష్మణ్, కళాశాల కన్వీనర్ సిహెచ్.కృష్ణారావు, అధ్యాపకులు నీలిమను అభినందించారు.

మరోసారి భూసమీకరణ ఉపసంహరించుకోవాలి

బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుష్పరాజు

గాంధీనగర్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : గతంలో రాజధాని అమరావతికి రైతుల నుంచి వేలాది ఎకరాలు సమీకరించిన సీఎం చంద్రబాబు ఐదేళ్ల పాటు తాత్కాలిక భవనాల పేరుతో కాలం గడిపారని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బచ్చలకుర పుష్పరాజు విమర్శించారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాజధాని నిర్మాణం చేపట్టకపోగా ఇప్పుడు మరలా రాజధాని విస్తరణ పేరుతో మరో 44 వేల ఎకరాల భూసమీకరణకు సిద్ధమవడాన్ని తప్పుబట్టారు. పేదలు, రైతు వ్యతిరేక చర్యలు మానుకోవాలని హితవుపలికారు. గతంలో మాజీ సీఎం జగన్ మూడు రాజధానుల పేరుతో అమరావతిని నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. ప్రజల సంక్షేమం, అభివృద్ధికి సీఎం చంద్రబాబు చర్యలు తీసుకోవాలన్నారు. కేవలం కార్పొరేట్లు, రియల్ ఎస్టేట్ వ్యాపారులకు దోచి పెట్టేందుకే భూసమీకరణ చేయాలని నిర్ణయించారని ఆరోపించారు. రాష్ట్ర కార్యదర్శి కొదమల ప్రభుదాసు, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్ష, ఉపాధ్యక్షులు వై.ఉదయ్‌కుమార్, డి.శామ్యూల్ కుమార్, కె.వి.రత్నం, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మహాత్ముడి ఆలోచన మేరకే అంబేడ్కర్‌కు రాజ్యాంగ రచన బాధ్యతలు

● ప్రధాని వ్యాఖ్యలకు కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ ఖండన



గాంధీనగర్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : రాజ్యాంగాన్ని కాంగ్రెస్ పార్టీ సరిగ్గా రాయించలేదని ప్రధాని నరేంద్ర మోదీ చేసిన వ్యాఖ్యలను కేంద్ర మాజీమంత్రి చింతామోహన్ ఖండించారు. మహాత్మాగాంధీ ఆలోచన మేరకు రాజ్యాంగాన్ని రాసే అవకాశాన్ని అంబేడ్కర్‌కు కాంగ్రెస్ పార్టీ కల్పించిందన్నారు. ప్రెస్‌క్లబ్‌లో సోమవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. అంబేడ్కర్ నీతి, నిజాయితీ కలిగిన వ్యక్తి అని కొనియాడారు. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా రాజ్యాంగాన్ని రచించి భారతదేశానికి ఇచ్చారన్నారు. ఇటీవల ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి ఇంట్లో రూ.500 కోట్లు పట్టుబడిన విషయాన్ని ఏ మీడియాలో రాకపోవడాన్ని ఆయన తప్పుబట్టారు. అంత పెద్ద మొత్తంలో డబ్బు ఎక్కడి నుంచి ఆయనకు వచ్చిందనే విషయాన్ని 48 గంటల్లో ప్రధానీ మోదీ, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ప్రజలకు వివరించాలని, లేదంటే వారు తమ పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. చీమకుర్తి గ్రానైట్ గనులు, టీటీడీలో షాపుల కేటాయింపులు, బ్యాంకుల్లో రుణాల మంజూరు, ప్రభుత్వ కాంట్రాక్ట్ పనుల్లో దళితులకు తగిన ప్రాధాన్యం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కర్ణాటక ప్రభుత్వం కాంట్రాక్టు పనుల్లో 24 శాతం ఎస్సీ, ఎస్టీలకు 15 శాతం ఓబీసీలకు ఇస్తుందని, ఇదే విధానాన్ని రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు అమలు చేయాలని డిమాండ్ చేశారు.

వీజీఎఫ్ విధానంలో బెజవాడలో సీ ప్లేన్ ప్రాజెక్టు



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ప్రకాశం బ్యారేజీ దగ్గర సీ ప్లేన్ ప్రాజెక్టు కార్యరూపం విషయంలో వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ (వీజీఎఫ్) విధానంలో ముందుకు వెళ్లాలని ప్రభుత్వం భావిస్తున్నట్టు తెలుస్తోంది. సీ ప్లేన్ ప్రాజెక్టు ఇప్పటికే అనుకున్న సమయానికంటే జాప్యమౌతోంది. ఈ ఏడాది జనవరి నెల నుంచే ప్రారంభం కావాల్సి ఉండగా.. అంతులేని జాప్యం జరుగుతోంది. కిందటేడాది నవంబరు నెలలో విజయవాడ నుంచి శ్రీశైలానికి ట్రయల్ రన్ నిర్వహించిన సంగతి తెలిసిందే. ఈ ట్రయల్ రన్ సందర్భంగా సీ ప్లేన్ నిర్వహణకు ఎక్కువ ఖర్చు అవుతోందని తెలుస్తోంది. దీనిని బట్టి టిక్కెట్ ధరలు కూడా భారీగా ఉంటున్నాయి. ట్రయల్ రన్ సక్సెస్ కావటంతో ప్రజలలో కూడా ఆసక్తి నెలకొనటంతో ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా ఐదు లోకేషన్లలో సీ ప్లేన్స్ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. విజయవాడ ప్రకాశం బ్యారేజీ నుంచి ముందుగా అనుకున్నట్టుగా శ్రీశైలం కాకుండా విజయవాడ - హైదరాబాద్ మధ్యన సీ ప్లేన్ నడపటానికి ముందుకు వచ్చినట్టు తెలుస్తోంది. ప్రకాశం బ్యారేజీ దగ్గర వాటర్ డ్రోమ్ ఏర్పాటుకు ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా టెండర్లు కూడా పిలిచినట్టు తెలుస్తోంది. ఆ తర్వాత నుంచి స్తబ్దత నెలకొంది. ఈ ప్రాజెక్టును కార్యరూపంలోకి తీసుకురావటానికి ప్రభుత్వం వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ (వీజీఎఫ్) విధానాన్ని అవలంబించాలని భావిస్తున్నట్టు తెలుస్తోంది. వీజీఎఫ్ విధానంలో ఈ ప్రాజెక్టు అతి త్వరలో సాకారమౌతుందని భావించాల్సి వస్తోంది.

అప్రమత్తత అవసరం

● అగ్ని ప్రమాదాల నివారణ అందరి బాధ్యత ● నివారణ చర్యలపై అవగాహన ఉండాలి

చిన్న నిర్లక్ష్యం పెద్ద ప్రమాదానికి కారణం..అగ్గి రగిలితే అంతా బుగ్గే.. భద్రత మన జీవన విధానం కావాలి.. ఇలా అనేక చోట్ల పెద్ద పెద్ద అక్షరాలతో బోర్డులు, గోడల మీద రాతలు కనిపిస్తుంటాయి. వేసవిలో తరచూ అగ్ని ప్రమాదాలు సంభవించే అవకాశాలు ఉంటాయి. వాటి నివారణకు అగ్నిమాపకశాఖ ముందస్తు ప్రణాళికలతో జాగ్రత్తలు తీసుకునేందుకు సిద్ధమవుతోంది. వేసవి లోనే కాదు అన్ని వేళలా అగ్ని ప్రమాదాల బారిన పడకుండా కొద్ది పాటి జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా గుర్తించాల్సి అవసరం ఎంతైనా ఉంది.

(ఆంధ్రజ్యోతి, ఇబ్రహీంపట్నం)





అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా అగ్నిమాపకశాఖ ఆసుపత్రులు, దుకాణ సముదాయాలు, పాఠశాలలు, కళాశాలలు, బహిరంగ ప్రదేశాల్లో అగ్ని ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అగ్ని ప్రమాదాలను ఎలా ఎదుర్కోవాలో అవగాహన కల్పించేందుకు మాక్ ఫైర్ డ్రిల్స్ నిర్వహించడం జరుగుతోంది. అగ్ని నుంచి భద్రత అనేది కేవలం ఒక వారం కార్యక్రమం కాదని అది మన నిత్య జీవన విధానంలో ఒక భాగమని ప్రతి ఒక్కరూ గుర్తించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

అగ్నిమాపక వారోత్సవాలను ప్రధానంగా అగ్ని ప్రమాదాల నుంచి ప్రజలను రక్షించడానికి, అగ్ని ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలపై చైతన్యం కల్పించేందుకు నిర్వహిస్తుంటారు. ఈనెల 14 నుంచి 20 వరకు ఆంధ్రప్రదేశ్ విపత్తు స్పందన, అగ్నిమాపక సేవల శాఖ వారు అగ్నిమాపక వారోత్సవాలను నిర్వహిస్తోంది. ప్రజలకు అనేక సందేశాలు అందించడమే ప్రధాన ఉద్దేశం. అగ్ని ప్రమాదాలను ఎలా ఎదుర్కోవాలి. అసలు జరగకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, జరిగిన వెంటనే ఎలా స్పందించాలో వివరిస్తున్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

● ఇంటిలోని వస్తువులను అల్మారాలో, షెల్ఫులలో సక్రమంగా ఉంచుకోవడంతో పాటు ఇంటిని పరిశుభ్రంగా ఉంచుకోవాలి. చిన్న పిల్లలకు అగ్గి పెట్టెలు, లైటర్లు, టపాకాయలు ఇతర మండే పదార్థాలను అందుబాటులో ఉంచరాదు. కాల్చిన సిగరెట్టు, బీడీలు, అగ్గి పుల్లలు పారవేసే ముందు ఆర్పి వేసి యాష్ ట్రేలో వేయాలి. బీఎస్ఐ మార్క్ ఎలక్ట్రికల్ వైరింగ్ పరికరాలనే ఉపయోగించాలి.

ప్రమాదాల నివారణకు ప్రజల భాగస్వామ్యం అవసరం



ప్రమాదాల నివారణకు ప్రజల భాగస్వామ్యం అవసరం. మేం ఎంత అవేర్‌నెస్ తెచ్చినా ప్రజలు జాగ్రత్తలు పాటించి తీరాలి. కాల్చి పారవేసే సిగరెట్ల వల్ల సుబాబుల్ తోటలకు, పంట పొలాల కంపలకు మంటలు అంటుకుంటాయి. వరిగడ్డి వాములు దగ్ధమవుతుంటాయి. సిగరెట్, బీడీ కాల్చిన తర్వాత పారేసే ముందుకు వాటిని పూర్తిగా ఆర్పి వేయాలి. అలాగే ప్రతి చోట విధిగా అగ్నిమాపక పరికరాలు అందుబాటులో ఉంచుకోవాలి. వాటిని ఎలా వినియోగించాలో సిబ్బందికి అవగాహన కల్పించాలి.

గౌతమ్, మైలవరం అగ్నిమాపకాధికారి

ఇంటి నుంచి ఎక్కువ రోజులు సెలవులకు బయటకు వెళ్లినప్పుడు మెయిన్ స్విచ్ ఆఫ్ చేయాలి. ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం జరిగితే ఆర్పడానికి ఎల్లవేళలా నీటిని ఇంటిలో నిల్వ చేయాలి.

● వంట ఇంటిలో: వంటింటి క్రింది పై భాగాల్లో గాలి వెలుతురు ఉండేటట్లు చూడండి. చెడిపోయిన గ్యాస్ ట్యూబ్‌ను బి.ఎస్.ఐ మార్క్ గల రబ్బరు ట్యూబ్‌తో వెంటనే మార్చండి. ఎల్‌పీజీ వాడకం పూర్తయిన తర్వాత సిలెండర్ వద్ద గల రెగ్యులేటర్‌ను వాల్వ్‌ను ఆపేయాలి. గ్యాస్ లీకవుతున్నట్లు అనుమానం వస్తే వెంటనే రెగ్యులేటర్ వాల్వ్ ఆపి వేయండి. ఎలక్ట్రికల్ స్విచ్‌లు ఆన్ ఆఫ్ చేయవద్దు. తలుపులు పూర్తిగా తెరవాలి. వంటగదిలో డీజిల్, పెట్రోల్, అదనపు గ్యాస్ సిలెండర్ వంటివి ఉంచకండి. వంట చేసేటప్పుడు సరైన నూలు వస్త్రాలు, ఎప్రాన్ గాని ధరించాలి.

● దుస్తులకు నిప్పు అంటుకున్నట్లయితే పరుగెత్తవద్దు. నేలపై దొర్లండి లేదా దుప్పటి చుట్టుకోండి. దీని వలన మంటలు ఆరిపోతాయి. కాలిన శరీర భాగం మీద చల్లని నీరు పోయండి. పొగతో నిండిన గదులలో మోచేతులు, మోకాళ్లపై పాకండి. ముక్కు, నోటికి అడ్డంగా తడి గుడ్డ నుంచి గాలి పీల్చడం ద్వారా పొగ, కార్బన్ డయాక్సైడ్‌ని పీల్చకుండా ఆపవచ్చు.

● కర్మాగారాల్లో పరిసరాల పరిశుభ్రత పాటించాలి. ఉద్యోగులందరిని అగ్ని ఉనికి ప్రదేశాలు గుర్తించే విధంగా చైతన్యవంతం చేయాలి. అగ్నిప్రమాదాలు జరిగితే ఎలా ఎదుర్కోవాలో తగిన శిక్షణ ఇవ్వాలి

● ఇంటిలో, కార్యాలయాలలో లేదా పబ్లిక్ ప్రదేశాల్లో అగ్ని ప్రమాదాలను నివారించడానికి అగ్నిమాపక యంత్రాలువినియోగించడంతో పాటు విద్యుత్ పరికరాలను సరిగ్గా నిర్వహించారు.

● అగ్నిమాపకశాఖ సేవలపై అవగాహన ఉండాలి. ప్రజలు అగ్ని ప్రమాద సమయంలో 101 నంబరుకు కాల్ చేయాలి.

● స్థానిక సంఘాలతో కలిసి అగ్ని ప్రమాదాల నివారణ చర్యలపై అవగాహన.

● అగ్నిమాపకశాఖ యొక్క త్యాగాలు, సాహసాన్ని గౌరవించడం. ప్రజలు వారితో సహకరించడం.

దుర్గగుడి ఘాట్‌రోడ్డులో చోరీ

● కారులోని 241 గ్రాముల బంగారం మాయం ● పనిచేయని సీసీ కెమెరాలు

ఇంద్రకీలాద్రి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రిపై ఘాట్‌రోడ్డులో పార్కింగ్ చేసిన హైదరాబాద్‌కు చెందిన ఓ భక్తుడి కారులో బంగారు ఆభరణాలు, నగదు చోరీ అయిన సంఘటన మంగళవారం జరిగింది. హైదరాబాద్‌లోని బృందావన్ కాలనీకి చెందిన బిల్డర్ ఆచంట దుర్గారావు కుటుంబ సభ్యులతో కలిసి కారులో అమలాపురంలో జరగనున్న బంధువుల శుభకార్యానికి బయల్దేరారు. మార్గ మధ్యలో మంగళవారం మధ్యాహ్నం 12 గంటలకు అమ్మవారి దర్శనం నిమిత్తం దుర్గగుడికి విచ్చేశారు ఆయన తన కారును ఘాట్‌రోడ్డులోని ఓం టర్నింగ్ వద్ద పార్కింగ్ చేసి, కుటుంబ సభ్యులతో కలిసి దర్శనానికి వెళ్లారు. దర్శనం అనంతరం మధ్యాహ్నం 1.15 గంటలకు కారు వద్దకు వచ్చి చూసుకోగా, కారులో భద్రపరిచిన బ్యాగ్‌లోని 241 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.10 వేలు చోరీకి గురయ్యాయి. బాధితుడు దేవస్థానంలోని అధికారులకు, పోలీసులకు సమాచారం తెలియపరిచాడు. వారు ఘటనాప్రాంతానికి వెళ్లి పరిశీలించారు. అనంతరం పోలీసులు వారిని వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌కు పంపించారు. సమాచారం తెలుసుకున్న వన్‌టౌన్ సీఐ, క్రైమ్ అధికారులు ఘటనాప్రదేశానికి వెళ్లి పరిశీలించి బాధితుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. దుర్గారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



భద్రతా వైఫల్యానికి నిదర్శనం

ఇంద్రకీలాద్రిపై భద్రతా వైఫల్యానికి ఈ చోరీ ఘటన నిదర్శనంగా నిలిచింది. ఘాట్‌రోడ్డులోని చోరీ ఘటనా ప్రాంతంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పనిచేయకపోవటంతో దేవస్థానం అధికారులు హడావిడిగా కొత్తవి ఏర్పాటు చేశారు. కొండ పైన, దిగువన సుమారు 200లకు పైగా సీసీ కెమెరాలు ఉన్నాయి. వాటిలో ఎన్ని సీసీ కెమెరాలు పనిచేస్తున్నాయి, ఎన్ని పనిచేయటం లేదనే పర్యవేక్షణ కొరవడింది. గతంలో సీసీ కెమెరాలపై పర్యవేక్షణ ఉండేది. ఎప్పటికప్పుడు పనిచేయని కెమెరాలను తొలగించి కొత్తవి ఏర్పాటు చేసేవారు. కొన్ని నెలల నుంచి పర్యవేక్షణ కొరవడిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. సీసీ కెమెరా విభాగంలో అనుభవం లేని సిబ్బంది ఉండటం, సరిపడినంత సిబ్బంది కూడా లేకపోవడం కూడా దీనంతటికీ కారణంగా చెప్పొచ్చు.



భద్రతా ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీపీ ఎస్.వి.రాజశేఖర్‌బాబు

కేంద్ర 16వ ఆర్థిక కమిషన్ బృందం విజయవాడకు రాక నేడు

● హరిత బెరంపార్క్‌లో సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ కార్యక్రమాలు

విద్యాధరపురం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): కేంద్ర 16వ ఆర్థిక కమిషన్ బృందం బుధవారం విజయవాడకు రానున్నది. భవానీపురంలోని హరిత బెరంపార్క్‌లో రాష్ట్ర ప్రభుత్వం తరఫున సీఎం చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగే కార్యక్రమంలో ఆర్థిక కమిషన్ బృందం పాల్గొంటుంది. ఈ నేపథ్యంలో హరిత బెరంపార్క్‌లో బందోబస్తు, ఇతర ఏర్పాట్లను మంగళవారం విజయవాడ పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖర్‌బాబు, రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక శాఖ అదనపు కార్యదర్శి కె.శ్రీనివాసులు పరిశీలించారు. భద్రతా పరంగా ఎటువంటి చిన్న లోపాలు కూడా లేకుండా చర్యలు తీసుకోవాలని, అన్ని శాఖల అధికారుల సమన్వయంతో కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కట్టుదిట్టమైన భద్రత, పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని అధికారులు తెలిపారు. డీసీపీలు కె.జి.వి.సరిత, కృష్ణమూర్తి నాయుడు, ఎస్.వి.డి ప్రసాద్, ఏడీసీపీ జి.రామకృష్ణ, పశ్చిమ ఏసీపీ దుర్గారావు, ఇతర ఏసీపీ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఆరోగ్య సదస్సు 20న

గవర్నర్‌పేట, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : ప్రజా ఆరోగ్య వేదిక ఆధ్వర్యంలో ఈనెల 20న ఎంజీ రోడ్డులోని ఎంబీవీకె భవన్‌లో రాష్ట్ర స్థాయి ఆరోగ్య సదస్సు నిర్వహిస్తున్నట్లు సంస్థ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కెవీఎస్ సాయిప్రసాద్ తెలిపారు. ఎంజీ రోడ్డులోని బాలోత్సవ్ భవన్‌లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వైద్యం ఖరీదుగా మారిన నేటి పరిస్థితుల్లో నాణ్యమైన ఉచిత వైద్యం ప్రజలందరికీ అందుబాటులో ఉంచడానికి ప్రజలతో పాటు ప్రభుత్వాల బాధ్యత తెలియజేసే లక్ష్యంతో సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సదస్సులో మేధావులు, సామాజిక సంస్థల ప్రతినిధులు, వైద్య ఆరోగ్య రంగ ఉద్యోగులు, మెడికల్ పారా మెడికల్ విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొనాలని కోరారు. ప్రజా రోగ్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎం.వి.రమణయ్య అధ్యక్షతన జరిగే సదస్సులో ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రైవేటీకరణ అంశంపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆరోగ్య, కుటుంబ సంక్షేమం మాజీ కార్యదర్శి డాక్టర్ పి.వి.రమేష్, ఆంధ్రప్రదేశ్ ఆరోగ్య బడ్జెట్-విశ్లేషణ అంశంపై ప్రముఖ బడ్జెట్ విశ్లేషకులు డాక్టర్ డేవిడ్ సుధాకర్ మాట్లాడతారని తెలిపారు. సదస్సులో ఐఎంఏ మాజీ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ జి. సమరం, మాజీ అధ్యక్షుడు డాక్టర్ వి. రాంప్రసాద్, ప్రముఖ వైద్యులు పాల్గొంటారని వివరించారు. ప్రజారోగ్య వేదిక ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.విజయ్‌ప్రకాష్, ఎంబీవీకె బాధ్యులు కె. స్వరూపరాణి, జన విజ్ఞాన వేదిక నాయకుడు బి.రవికుమార్ పాల్గొన్నారు.

మెగా డీఎస్సీకి ఆన్‌లైన్ ద్వారా ఉచిత శిక్షణ

వన్‌టౌన్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ సంచాలకులు ఆదేశాల మేరకు ఎన్టీఆర్ జిల్లా బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో మెగా డీఎస్సీ పరీక్షలకు ఆన్‌లైన్ ద్వారా ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఎన్టీఆర్ జిల్లా బీసీ స్టడీ సర్కిల్ సంచాలకులు కె.లక్ష్మీదేవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. టెట్ (టీచర్ ఎలిజిబులిటీ టెస్ట్) అర్హత సాధించిన అభ్యర్థులు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈ బీసీ కేటగిరిలకు చెందిన అభ్యర్థుల నుంచి ఉచిత శిక్షణకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. అభ్యర్థులు టెట్ అర్హత మార్కుల పత్రం, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రం, తెల్ల రేషన్ కార్డు, ఆధార్ కార్డుతో పాటు పాస్‌పోర్టు సైజు ఫోటో దరఖాస్తుకు జతపరచి డైరెక్టర్ ఏపీ బీసీ స్టడీ సర్కిల్, విజయవాడ, డోర్ నెం.74-2-1/5, ప్లాట్ నెం.34ఎ, పండరీపురం, అశోక్‌నగర్, విజయవాడ, ఎన్టీఆర్ జిల్లా చిరునామాకు దరఖాస్తులు పంపించాలని ఆమె ఒక ప్రకటనలో తెలిపారు. మరిన్ని వివరాల కోసం 9966849937, 9505094349, 8688855255 నెంబర్లను సంప్రదించాలన్నారు.

నూతన సాంకేతిక ఆవిష్కరణలపై వికాస్‌లో జాతీయ సదస్సు ప్రారంభం

విజయవాడ రూరల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : నున్నలోని వికాస్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో మంగళవారం నూతన సాంకేతికత ఆవిష్కరణలపై ఎన్‌సీశక్తి-2025 పేరుతో రెండు రోజుల జాతీయ సదస్సును నమీబియా యూనివర్సిటీ ప్రొఫెసర్ కె. వెంకటేశ్వర్లు ముఖ్య అతిధిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన సాంకేతిక ఆవిష్కరణలు, పరిజ్ఞానం తదితర అంశాలపై ప్రసంగించారు. రాకెట్ ఇంజన్‌లో వాడే నూతన సాంకేతిక విధానాలతో పాటుగా భారతదేశం స్వయం సమృద్ధిని సాధించడంతో పాటు పరిశోధనల ఫలాలు విదేశాలకు అందించడంలో ముందంజలో ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాలకు చెందిన పలువురు విద్యార్థులు, సాంకేతిక నిపుణులు 117 పరిశోధన పత్రాలను ఆవిష్కరించారు. కళాశాల చైర్మన్ నరెడ్ల నర్సిరెడ్డి, డైరెక్టర్ కీర్తి, కాన్ఫరెన్స్ కన్వీనర్ పవన్ సాయి, తదితరులు పాల్గొన్నారు.




జ్యోతి ప్రకాశనం చేస్తున్న మంత్రి రవీంద్ర, ఎస్‌వీహెచ్ ఇంజనీరింగ్ కళాశాల, సుజనా అకాడమీ విలీనం సందర్భంగా ఒప్పంద ప్రతాలు సమర్పించుకుంటున్న సుజనా చౌదరి, కొనకళ్ల నారాయణరావు

ఎడ్యుకేషన్ హబ్‌గా మచిలీపట్నం

● ఎస్‌వీహెచ్ విలీన కార్యక్రమంలో మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నాన్ని ఎడ్యుకేషనల్ హబ్‌గా తీర్చిదిద్దుదామని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖా మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. ఎస్‌వీహెచ్ ఇంజనీరింగ్ కళాశాల సుజనా గ్రూప్‌లో విలీనం ఒప్పందం సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మంత్రి రవీంద్ర ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఇకపై ఎస్‌వీహెచ్ ఇంజనీరింగ్ కళాశాల పేరు యలమంచిలి జనార్ధనరావు, దైతా మధుసూధనశాస్త్రి కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌గా మారబోతుందన్నారు. మెంటార్‌గా వీఆర్ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్యం వ్యవహరిస్తోందన్నారు. ఈ సందర్భంగా సుజనా గ్రూప్ చైర్మన్, ఎమ్మెల్యే సుజనా చౌదరికి హిందూ విద్యా సంస్థల గ్రూప్ అధ్యక్షుడు, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు విలీనపత్రాలు అందజేశారు. మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ, బందరు ఇంజనీరింగ్ కళాశాలకు పూర్వవైభవం వస్తుందన్నారు. మచిలీపట్నం ఓడరేవు నిర్మాణం పూర్తయిన తరువాత నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు మెరుగవుతాయన్నారు. మాజీ కేంద్ర మంత్రి, విజయవాడ ఎమ్మెల్యే సుజనా చౌదరి మాట్లాడుతూ, ఇంజనీరింగ్ కళాశాల అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామన్నారు. ఆధునిక శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకునేలా కళాశాలలో కొత్త కోర్సులు ప్రవేశపెడతామన్నారు. లెక్చరర్ల నియామకాలు, విద్యా విషయక అంశాలు సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్యం పరిశీలిస్తుందన్నారు. విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పిస్తామన్నారు. ఆర్టీసీ చైర్మన్, హిందూ కళాశాల అనుబంధ సంస్థల చైర్మన్ కొనకళ్ల నారాయణరావు మాట్లాడుతూ, బందరు ఎస్‌వీహెచ్ ఇంజనీరింగ్ కళాశాల కొన్ని సమస్యల్లో ఉండటం వల్ల పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు విలీనం కార్యక్రమం చేపట్టామన్నారు. ఎమ్మెల్యేలు బోడే ప్రసాద్, యార్లగడ్డ వెంకట్రావు, కాగిత కృష్ణప్రసాద్ ముడా చైర్మన్ మట్టా ప్రసాద్, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి బండి రామకృష్ణ, కొనకళ్ళ జగన్నాధరావు, మోటమర్రి బాబాప్రసాద్, బత్తిన దాసు, గోపు సత్యనారాయణ, ఇలియాస్ పాషా, వాలిశెట్టి తిరుమలరావు, ఎస్పీ ఆర్. గంగాధరరావు, కార్యదర్శి డి.జి. శాస్త్రిలు పాల్గొన్నారు.

తమ్ముడి మరణం తట్టుకోలేక సోదరి మృతి.. దొండపాడులో విషాదం



రామాంజనేయులు, అంజలి (ఫైల్)

గుడివాడ రూరల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దొండపాడు గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ గద్దె రామాంజనేయులు (54) అనారోగ్య కారణాలతో విజయవాడలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో మంగళవారం మరణించారు. సోదరుడి మృతదేహాన్ని చూసి బయటకు వచ్చి తట్టుకోలేక ఆయన సోదరి ముక్తినేని అంజలి మరణించారు. విజయవాడలో వీరి మృతదేహాలను ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో ఉంచారు. రామాంజనేయులు భార్య గద్దె పుష్పరాణి ప్రస్తుతం ఎంపీపీగా ఉన్నారు. ఈయనకు ఐదుగురు అక్కలు. భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. తమ్ముడు మరణ వార్త తట్టుకోలేక అక్క కూడా మరణించటంతో గుడివాడ, దొండపాడు గ్రామాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఎమ్మెల్యే గద్దె రామ్మోహనరావు, టీడీపీ, వైసీపీ నాయకులు వారి భౌతిక కాయాలను సందర్శించి నివాళులర్పించారు.



తహసీల్దార్ కార్యాలయంలో డీటీ ధనలక్ష్మికి వినతిపత్రాన్ని అందజేస్తున్న టీడీపీ సీనియర్ నాయకుడు వీర వెంకట నాగ బెనర్జీ

అక్రమంగా మట్టి తవ్వుతున్నారని ఫిర్యాదు చేస్తే దాడి

● చర్యలు కోరుతూ టీడీపీ సీనియర్ నాయకుడు ఫిర్యాదు

పెదపారుపూడి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : పెదపారుపూడి గ్రామంలో అక్రమంగా మట్టి తవ్వుతున్నారని ఫిర్యాదు చేసిన టీడీపీ సీనియర్ నాయకుడు, మాజీ ఉపసర్పంచ్ పునుకొల్లు వీర వెంకట నాగ బెనర్జీపై గ్రామసర్పంచ్ భర్త చప్పిడి కిషోర్ వర్గం దాడి చేశారు. బెనర్జీ మంగళవారం తన నివాసం వద్ద రైతులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. బేతవోలు - పెదపారుపూడి పొలిమేర డొంక తవ్వటానికి ప్రయత్నం చేస్తున్నారని తెలిసి ముందుగానే ఫిర్యాదు చేశామన్నారు. దానిని తవ్వటం వల్ల వర్షాకాలంలో చంద్రయ్య కాల్వ నీళ్లు పొంగి రైతులకు పంట నష్టం జరుగుతుందన్నారు. తాను ఫిర్యాదు చేయటంతో శనివారం రాత్రి చెరువు గట్టు సెంటర్‌లో సాంబయ్య హోటల్‌లో ఒంటరిగా ఉన్న సమయంలో చప్పిడి కిషోర్, చప్పిడి మాణిక్యాలరావు, పీకా రత్నరాజు మరో ఐదుగురు వ్యక్తులు తన పై దాడి చేశారన్నారు. ఇదే విషయాన్ని మండల నాయకులు, నియోజకవర్గ నాయకులు దృష్టికి తీసుకెళ్లగా, ఎటువంటి స్పందన లేకపోవటం బాధాకరమన్నారు. రైతు భాను మాట్లాడుతూ పార్టీ స్థాపించిన నాటి నుంచి ఇప్పటి వరకు పార్టీని నమ్ముకున్న వ్యక్తి బెనర్జీపై దాడి చేసిన వాళ్లని కూడా పార్టీ నుంచి సస్పెండ్ చేసి కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. దాడి చేసిన వారిపై చర్యలు కోరుతూ డీటీ ధనలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో గారపాటి వీర వెంకట నాగబాబురావు, చెరుకూరి మల్లిఖార్జునరావు, వెనిగళ్ల వెంకటేశ్వరరావు, శిఖ గోవర్ధన, పీక ఫణి, సోలి రక్తందాసు, బొల్లవరపు శారాబంది, గోగినేని పున్నయ్య, పాలడుగు గణేష్, పూనుకొల్లు మురళీకృష్ణ, అడుసుమిల్లి శ్రీనివాస్ కుమార్, ఎర్ర బాబు, సీతారామయ్య పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	133, 142, 153
చికెన్ విత్ స్కిన్	250
చికెన్ స్కిన్‌లెస్	260

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 420

చెరువు పూడికతీత పనులు ముమ్మరం

అవనిగడ్డ రూరల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): పులిగడ్డ పంచాయతీ పరిధిలో గల కనకదుర్గమ్మ అమ్మ వారి దేవాలయం ఎదుట ఉన్న చెరువు పూడికతీత పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఈ కార్యక్రమాన్ని సర్పంచ్ దాసరి విజయ్ కుమార్ సోమవారం ప్రారంభించారు. ఈ నేపథ్యంలో ఉపాధి హామీ మేటు తండు గంగాధర్ ఆధ్వర్యంలో పనులు నిర్వహిస్తున్నారు.



పూడికతీత పనుల్లో కూలీలు

వైద్యుల కోసం నిరీక్షణ!

● రావివారిపాలెం పీహెచ్‌సీలో సమయపాలన పాటించని సిబ్బంది

మోపిదేవి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మోపిదేవి పంచాయతీ శివారు రావివారిపాలెం ప్రాథమిక కేంద్రంలో వైద్యులు, ఉద్యోగులు సమయ పాలన పాటించడం లేదు. దీంతో రోగులు వైద్యుల కోసం వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. పీహెచ్‌సీలో ఇద్దరు వైద్యులు పని చేస్తుండగా, పది మంది ఉద్యోగులు ఉన్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఓపి చూడాల్సి ఉంది. 24 గంటలు సేవలు అందించేలా పీహెచ్‌సీ అప్‌గ్రేడ్ అయింది. 9 గంటలకు రావాల్సిన వైద్యులు పది గంటలైనా ఏ ఒక్కరూ రాకపోవటంతో వైద్యుల రాకకోసం పలు గ్రామాల నుంచి విచ్చేసిన రోగులు ఆసుపత్రి వెలుపల చెట్ల నీడన వేచి ఉండాల్సి వస్తుందని సర్వత్రా విమర్శలు వినవస్తున్నాయి. పీహెచ్‌సీ పరిధిలో నాలుగు సబ్ సెంటర్లు, 9 గ్రామపంచాయతీలు ఉన్నాయి. ప్రతి రోజూ 50 నుంచి 60 ఓపీలు వస్తుండగా, రెగ్యులర్‌గా 30 మంది దీర్ఘకాలిక వ్యాధులకు చికిత్స నిమిత్తం వస్తుంటారు. ప్రభుత్వం వైద్యపరంగా ఏ విధమైన లోటుపాట్లు లేకుండా సేవలు అందించాలని చెబుతున్నా పీహెచ్‌సీలో వైద్యులు, సిబ్బంది సమయ పాలన పాటించటం లేదని పలు గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు.



రావివారిపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం



వైద్యుల కోసం రోగుల ఎదురుచూపులు

చల్లపల్లి ప్రభుత్వాసుపత్రిలో ఎక్స్ రే సేవలు అవసరం

చల్లపల్లి : చల్లపల్లి ప్రభుత్వాసుపత్రిలో ఎక్స్ రే సేవలు అందబాటులో లేవు. ఆసుపత్రిని గత కొన్నేళ్ల క్రితం ఆధునీకరించారు. దీంతోపాటుగా వైద్యులు పూర్తిస్థాయిలో ఉంటుండటంతో రోగులకు మెరుగైన సేవలు అందుతున్నాయి. ఎక్స్ రే మిషన్ ఆసుపత్రిలో ఉన్నప్పటికీ సీఆర్ (కంప్యూటర్ రేడియోగ్రఫీ) మిషన్ లేకపోవటంతో ఎక్స్ రే తీసేందుకు అవకాశం లేకుండా పోయింది. దీంతో టెక్నీషియన్ డిప్యూటేషన్‌పై మచిలీపట్నంలో విధులు నిర్వహిస్తున్నాడు. ఎక్స్‌రే సౌకర్యం లేకపోవటంతో రోడ్డు ప్రమాదాలు, ఇతరత్రా గాయాలైన రోగులను ఎక్స్ రే కోసం మచిలీపట్నం రిఫర్ చేయాల్సి వస్తోంది. ఎక్స్‌రే యంత్రం అందుబాటులోకి వస్తే ఎంతోమందికి ఉపయోగంగా ఉంటుంది. ఆ దిశగా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు కృషిచేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఎక్స్‌రే యంత్రంతో పాటు ఆసుపత్రిలో గైనకాలజిస్ట్ పోస్టు భర్తీ కావాల్సి ఉంది. సీఆర్ మిషన్ అవసరాన్ని స్థానిక ఎమ్మెల్యేకు, జిల్లా కలెక్టర్‌కు తెలియచేసినట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బిఎస్.శ్రీనివాస్ తెలిపారు.



చల్లపల్లి ప్రభుత్వాసుపత్రిలో నిరుపయోగంగా ఎక్స్‌రే పరికరం



తూడు, డెక్కా తొలగించటంతో ప్రవహిస్తున్న సాగునీరు

తూడు, డెక్క తొలగింపు

అవనిగడ్డ రూరల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): అవనిగడ్డ శివారు కాలిబాట వంతెన వద్ద పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని ఇరిగేషన్ డీఈ పులిగడ్డ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో పూర్తి స్థాయిలో పరిశుభ్రపరిచారు. ఇటీవల దిగువ ప్రాంతాలకు సాగు నీరు అందకపోవటంతో డీఈ దృష్టికి ఈ విషయం తీసుకెళ్లటంతో స్పందించిన ఆయన లస్కర్లతో తూటుకాడ, గుర్రపు డెక్కను పూర్తిగా తొలగించారు.



చదును చేసిన రహదారి

రహదారికి మరమ్మతులు

మోపిదేవి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): గడిచిన కొన్నేళ్లుగా గోతులు పడి అధ్వానంగా ఉన్న బండికోళ్ల లంక, కొక్కిలిగడ్డ వెళ్లే జిల్లా పరిషత్ రహదారి మరమ్మతు పనులు ఎట్టకేలకు మంగళవారం ప్రారంభించారు. 1.5 కిలోమీటర్ల దూరం ఉండే ఈ రహదారి గడిచిన కొన్నేళ్లుగా ఏ విధమైన కనీస మరమ్మతులకు నోచుకోలేదు. మండల పరిషత్ నిధులతో జీఎస్బీ నిర్మాణం చేపట్టేలా మరమ్మతు పనులు ప్రారంభించారు. ప్రస్తుతం రహదారిని ప్రొక్లెయినర్ సహాయంతో చదును చేసే పనులను ఎంపీపీ రావి దుర్గావాణి, సర్పంచ్ దిడ్ల జానకి రాంబాబు, ఎంపీటీసీ దిడ్ల రాణిలు కొబ్బరికాయ కొట్టి రహదారి చదును చేసే పనులు ప్రారంభించారు. రెండు రోజుల్లో జీఎస్బీ పరిచి తాత్కాలిక మరమ్మతులు పూర్తి చేయనున్నట్లు సర్పంచ్ తెలిపారు.



రక్తదానం చేస్తున్న యువకులు

రక్తదాన శిబిరం

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : పిల్లారిశెట్టిపాలెంలో స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం మెగారక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ జన్ను సుబ్బారావు, కొండేటి దుర్గారావు, ఎండి సలీమ్, డా. రాజశేఖర్, స్ఫూర్తి ఫౌండేషన్ అధ్యక్షుడు నీలపాల ఫణికుమార్, కొడాలి మణిబాబు, ఐనాల సుధాకర్, నవీన్, బండికట్ల రాము, కంద్రకోట స్వర్ణలత, తుంగ నరేష్, పొదిల కుటుంబరావు తదితరులు పాల్గొన్నారు.

చక్కా నాగేశ్వరరావుకు మంత్రి కొల్లు రవీంద్ర నివాళి

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ వైద్యుడు చక్కా జగదీష్ తండ్రి చక్కా నాగేశ్వరరావు(75) గుండెపోటుతో మంగళవారం మృతిచెందారు. చక్కా నాగేశ్వరరావు భౌతిక కాయాన్ని రాష్ట్ర గనులు, భూగర్భవనరులు, ఎక్సైజ్ శాఖా మంత్రి కొల్లు రవీంద్ర, మత్స్యకార సంఘ జిల్లా అధ్యక్షుడు కొక్కిలిగడ్డ నాగరమేష్‌లు సందర్శించి నివాళులర్పించారు.



జిల్లా ప్రధాన న్యాయాధికారి అరుణసారికను సత్కరిస్తున్న న్యాయాధికారులు

న్యాయవ్యవస్థలో పనిచేయడం అదృష్టం

జిల్లా ప్రధాన న్యాయాధికారి అరుణసారిక

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : ఎంతో పురాతనమైన మచిలీపట్నం బార్ అసోసియేషన్‌తో అనుసంధానమైన కృష్ణాజిల్లా కోర్టులో పనిచేయడం తన అదృష్టంగా భావిస్తున్నట్లు జిల్లా జడ్జి ఎస్. అరుణసారిక అన్నారు. మచిలీపట్నం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం బదిలీపై చిత్తూరు జిల్లాకు వెళుతున్న అరుణసారిక, విశాఖపట్నం జిల్లా జడ్జిగా బదిలీ అయిన చిన్నంశెట్టి రాజు, 10వ అదనపు జిల్లా జడ్జి సరికొండ చినబాబుకు మచిలీపట్నం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా వీడ్కోలు సభ నిర్వహించారు. మచిలీపట్నం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బూరగడ్డ అశోక్‌కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో న్యాయమూర్తులు ముగ్గురిని ఘనంగా సన్మానించారు. అనంతరం మచిలీపట్నం బార్ అసోసియేషన్ సభ్యుడు లంకిశెట్టి సాయిఫణిసంతోష్‌ను బార్ సభ్యులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ కార్యదర్శి ఎస్.ఎస్.ఎస్. సాయిబాబు, కార్యవర్గ సభ్యులు, సీనియర్ న్యాయవాదులు పరసా మధుసూధనరావు, ఏ. సత్యనారాయణ, శిర్విశెట్టి నగధరనాథ్, సింగలూరి శాంతిప్రసాద్, మహమ్మద్ రఫీ, మాజీ ప్రభుత్వ న్యాయవాది అజ్మతున్నీసా, కొండపల్లి వేణు, జూనియన్ న్యాయవాదులు, మహిళా న్యాయవాదులు, న్యాయశాఖ సిబ్బంది, న్యాయవాద గుమాస్తాల సంఘ సభ్యులు పి.వి. ఫణికుమార్ తదితరులు పాల్గొన్నారు.



చెక్కులు అందజేస్తున్న కూటమి నాయకులు

లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : 39వ డివిజన్ పరిధిలో పలువురికి మంగళవారం ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను డివిజన్ టీడీపీ ఇన్‌ఛార్జి కట్టా అంజిబాబు అందజేశారు. పామర్తి ధరణికుమార్ కిడ్నీలో రాళ్ల శస్త్ర చికిత్స చేయించుకోగా రూ. 1,58,226, గుండె సంబంధిత శస్త్ర చికిత్స చేయించుకున్న రావి వెంకట సుబ్బారావుకు రూ. 1,98,999లను కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ బీజేపీ ఇన్‌ఛార్జి ధూళిపాళ శ్రీరామచంద్రమూర్తి, జనసేన ఇన్‌ఛార్జి నరహరిశెట్టి రామ్, నాయకులు మెట్టు సూరిబాబు, పామర్తి వెంకటేశ్వరరావు, మాటూరి దీపక్, మురాల భాను, చేబ్రోలు కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎస్ఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌కు అవార్డు

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం ఎస్ఎస్ఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎన్. ఏంజెల్ గ్లేవియర్ ప్రతిష్టాత్మకమైన అంబేద్కర్ జాతీయ అవార్డు అందుకున్నారు. గుంటూరు ఏసీ కళాశాలలో సోమవారం రాత్రి జరిగిన కార్యక్రమంలో తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్, మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్. లక్ష్మణరావు, డొక్కా మాణిక్యవరప్రసాద్ చేతుల మీదుగా ఈ పురస్కారం అందుకున్నారు. గ్లేవియర్‌ను కళాశాల యాజమాన్యం అభినందించింది.

26న మత్స్యకార భరోసా..

అవనిగడ్డ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 26న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతులమీదుగా మత్స్యకార భరోసాను మత్స్యకారులకు అందించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించటంపై టీడీపీ నేత, ఆంధ్రప్రదేశ్ సాంప్రదాయ మత్స్యకారుల సేవా సమితి ప్రధాన కార్యదర్శి లకనం నాగాంజనేయులు హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన అవనిగడ్డ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో మాట్లాడారు.

చిన్నారులకు పౌష్టికాహారం అందించాలి

పెడన రూరల్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి) : అంగన్వాడీ కేంద్రాలలో చిన్నారులకు పౌష్టికాహారం అందించాలని నందమూరు వాసవీ ఇంజనీరింగ్ కళాశాల కరస్పాండెంట్ కాకి కుమార్ బాబు అన్నారు. కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం విద్యార్థులు నందమూరు అంగన్వాడీ కేంద్రాలలో చిన్నారులకు, గర్భిణులకు, బాలింతలకు గుడ్లు, బిస్కెట్స్, పండ్లు, చిరుధాన్యాల పొడి అందజేశారు. పోషక అభియాన్ పథకం ద్వారా ప్రభుత్వం చిన్నారులకు అందించే ఆహారంపై అవగాహన కల్పించారు. ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ అనిల్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.



సమీక్షా సమావేశం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్

లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందించడమే ధ్యేయం: ఎమ్మెల్యే కాగిత

గూడూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు ప్రతి ఒక్క లబ్ధిదారుడికీ అందించడమే ధ్యేయమని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. మంగళవారం గూడూరు మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి కాలం గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో డీసీ ఛైర్మన్ పోతన స్వామి, వివిధ శాఖల ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కన్నమనాయుడు

అభివృద్ధి ప్రణాళికల అమలుకు ప్రత్యేక బృందాలు

పెడన, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : విజన్ - 2047 డాక్యుమెంట్‌కు సంబంధించిన అభివృద్ధి ప్రణాళికలను అమల్జేసేందుకు జిల్లా, నియోజకవర్గ, మండల, గ్రామ స్థాయిలలో ప్రత్యేక బృందాలను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తోందని జిల్లా పరిషత్ సీఈవో కె. కన్నమనాయుడు తెలిపారు. బృంద సభ్యులుగా చేరడానికి పెడన నియోజకవర్గం నుంచి ఆరుగురు దరఖాస్తు చేశారు. వీరికి అభివృద్ధి ప్రణాళికలను అమలు చేయగలిగే సామర్థ్యం ఉందో లేదో పరిశీలించడానికి మంగళవారం కన్నమనాయుడు ఎండీవో కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి నియోజకవర్గంలో ఐదుగురు సభ్యులతో బృందాన్ని ఏర్పాటు చేయనున్నామన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా గ్రామ, వార్డు సచివాలయాల నుంచి ఆరుగురు మాత్రమే దరఖాస్తు చేసుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ ఆరుగురు సభ్యులు విజన్ - 2047 డాక్యుమెంట్ అమలు చేయడానికి అర్హులు కాకపోతే మళ్లీ కాల్‌ఫర్ చేస్తామన్నారు. విజన్ 2047 డాక్యుమెంట్ అమలుకు గాను తనను పెడన నియోజకవర్గానికి ప్రత్యేక అధికారిగా నియమించారన్నారు. ఇన్‌ఛార్జి ఎండీ సీహెచ్. వెంకటేశ్వర్లు, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో వజీర్ అహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

పది విద్యార్థులకు జూమ్ యాప్‌లో తరగతులు

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతిలోకి ప్రవేశిస్తున్న విద్యార్థులకు ప్రముఖ విద్యావేత్త దిట్టకవి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రతి ఆదివారం సాయంత్రం 5 గంటలకు జూమ్ యాప్ ద్వారా వివిధ అంశాలపై శిక్షణా తరగతులు నిర్వహిస్తారని డీవైఈవో శేఖర్‌సింగ్ తెలిపారు. మచిలీపట్నం చిలకలపూడి మున్సిపల్ హైస్కూల్‌లో మంగళవారం ఆలివ్ మిఠాయి మిషన్ ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాల వాల్‌పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీవైఈవో మాట్లాడుతూ మచిలీపట్నంలో 10వ తరగతి విద్యార్థులు ఈ సదావకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. ప్రముఖ విద్యావేత్త దిట్టకవి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో ప్రతి యేటా పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు రూ. లక్ష నగదు బహుమతులు అందిస్తున్నారన్నారు. మానవత స్వచ్ఛంధ సేవా సంస్థ ప్రతినిధులు అయ్యప్పస్వామి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. కాగా చిలకలపూడి మున్సిపల్ స్కూల్ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ కార్యక్రమం కింద పది రోజుల పాటు మానస సూపర్ మార్కెట్, అయ్యప్ప కట్‌పీసెస్‌లను సందర్శించి వ్యాపార లావాదేవీలపై అవగాహన కల్పించారు.

ఘనంగా నెల్లూరు రవీంద్ర భారతి వార్షికోత్సవం

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నంలోని నెల్లూరు రవీంద్ర భారతి పాఠశాల వార్షికోత్సవం మంగళవారం లక్ష్మీటాకీసు సెంటర్‌లోని ఎన్ కన్వెన్షన్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ ఆశాలత, వైద్యురాలు గౌరీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీన్ శ్రీకాంత్ యాదవ్, ప్రధానోపాధ్యాయురాలు సీతామహాలక్ష్మి, ఉపాధ్యాయులు శాంతకుమారి, ప్రసన్న, ఉమ, పాఠశాల సూపర్‌వైజర్ ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు బార్ అసోసియేషన్ ఎన్నికలు

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం బార్ అసోసియేషన్‌కు బుధవారం ఎన్నికలు జరగనున్నాయి. అధ్యక్ష పదవికి బూరగడ్డ అశోక్‌కుమార్, దివి పోతురాజు, తుంగల హరిబాబులు పోటీ చేస్తున్నారు. ఉపాధ్యక్ష పదవికి కుంపటి ప్రసాద్, మహమ్మద్ మస్తాన్, రెడ్రౌతు రమణరావు, ప్రధాన కార్యదర్శి పదవికి శాయన సుధాకర్, సిద్ధినేని శ్రీసత్యసాయిబాబు, కోశాధికారి పదవికి పసుమర్తి సూర్యప్రసాదరావు, ఊసా రాధాకృష్ణమూర్తిలు పోటీ చేస్తున్నారు. జాయింట్ సెక్రటరీ పదవికి అద్దేపల్లి నిరంజనరావు, గాదె శామ్యూల్ పోటీ చేస్తున్నారు. కాగా స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీ గాదెపల్లి శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. లైబ్రరీ సెక్రటరీగా అర్జా శ్యామ్‌ప్రసాద్, కార్యవర్గ సభ్యులుగా బండారు వెంకటేశ్వరరావు, ఎండీ మిరాజుద్దీన్, కె. వేణుబాబు, జి. విజయబాబు, పడమట ప్రవీణ్‌కుమార్, బండి బసవేశ్వరరావు, గుమ్మడి సుబ్బారావు, పామర్తి నరసింహమూర్తిలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఎన్నికలు జరుగుతాయి. ఎన్నికల అధికారిగా వింజమూరి శివరాం వ్యవహరిస్తున్నారు. ఎన్నికల అనంతరం ఓట్ల లెక్కింపు జరుగుతుంది. 351 మంది ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.



విద్యార్థినులను అభినందిస్తున్న కొల్లు శ్రీనివాసరావు తదితరులు

ప్రభుత్వ కళాశాలలపై కూటమి ప్రత్యేక దృష్టి

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం ప్రభుత్వ కళాశాలల పట్ల ప్రత్యేక దృష్టి సారించడం అభినందనీయమని సిటీ కేబుల్ ఎండీ కొల్లు శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం స్థానిక లేడీయాంప్తిల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇటీవల ఇంటర్ పరీక్షలలో మొదటి స్థానం సాధించిన విద్యార్థినులు ఏ. బాలా త్రిపుర సుందరి, ఎం. గాయత్రిల అభినందన సభను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల అభివృద్ధి కమిటీ కార్యదర్శి కొల్లు శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. అనంతరం ఇరువురు విద్యార్థులకు రూ. 10వేల నగదు బహుమతులు అందజేసి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వి. సుందరలక్ష్మి, అధ్యాపకులు విజయశ్రీ, సురేష్, విద్యార్థులు పాల్గొన్నారు.



చక్రార్చన వేడుకను నిర్వహిస్తున్న భక్తులు

భక్తిశ్రద్ధలతో చక్రార్చన వేడుక

నాగాయలంక, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): నాగాయలంకలోని పార్వతీ సమేత కన్యకా పరమేశ్వరీ సమన్విత నగరేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం ఆర్యవైశ్య సంఘం, వాసవీ సేవాదళ్ సంయుక్త ఆధ్వర్యంలో చక్రార్చన వేడుకను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన ఆధ్యాత్మిక వేత్త సుజాత బృందం నేతృత్వంలో ఆలయ ప్రాంగణంలో పార్వతీ దేవి ముంగిట శ్రీ చక్రార్చన కోసం పృథ్వీ చక్రం సంప్రదాయబద్ధంగా రూపొందించారు. భక్తులు వెలుగుతున్న ప్రమిదను దర్శించుకున్నారు. మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు చిట్టా శివ నాగేశ్వరరావు, ప్రముఖ ప్రవచన కర్త డాక్టర్ అనంతలక్ష్మి ఈ వేడుక ను ప్రారంభించారు. అనంతరం ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. ఆలయ కమిటీ ఛైర్మన్ చిట్టా సాంబశివరావు, తాడికొండ సత్యనారాయణ, చిట్టా వీర అన్నపూర్ణయ్య, జల్లూరు ప్రకాష్, చిట్టా అది రాజేష్, చిట్టా వెంకట శేఖర్, దేసు సత్యనారాయణ, ఉప్పల నగరేశ్వరరావు, వాణి పాల్గొన్నారు.

కృష్ణా యూనివర్సిటీలో శిక్షణా తరగతులు

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : కృష్ణా విశ్వవిద్యాలయంలో మూడ్రోజుల పాటు మైక్రోసాఫ్ట్ సంస్థ ప్రతినిధులచే ఉద్యోగ, ఉపాధి అవకాశాల శిక్షణా తరగతులను ఉపకులపతి కూన రాంజీ ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, మైక్రోసాఫ్ట్ సంస్థ చేసుకున్న అవగాహన ఒప్పందంతో ఈ శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. మైక్రోసాఫ్ట్ సంస్థ ప్రతినిధులు సచిన్ చౌహాన్‌లతో పాటు రిజిస్ట్రార్ ఎన్. ఉష, ఇంజనీరింగ్ కళాశాల డీన్ వై.కె. సుందరకృష్ణ, ప్రిన్సిపాల్ ఆర్. విజయకుమారి, ఎం. బాబురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్‌బర్డ్	133, 142, 153
చికెన్ విత్ స్కిన్	250
చికెన్ స్కిన్‌లెస్	260

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 420

స్వచ్ఛ సింగలూరే లక్ష్యం : ఎంపీడీవో


పంచాయితీకి రిక్షా అందచేస్తున్న దాతలు

గుడ్లవల్లేరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : సింగలూరును స్వచ్ఛ సింగలూరుగా తీర్చిదిద్దడమే లక్ష్యమని ఎంపీడీవో టి.విజయసారథి పేర్కొన్నారు. సింగలూరులో భాగ్యవిధాత చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సింగలూరు హోమ్ ఎకోఫ్రెండ్లీ ప్రోడక్ట్స్ షీ నిర్వాహకులు ఉచితంగా డస్ట్ బిన్లు ,రిక్షాను మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో టి.వి జయసారథి గ్రామంలోని అన్ని కుటుంబాల వారికీ డస్ట్‌బిన్‌లను పంపిణీ చేశారు. ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ బండారు శ్యామ్‌కుమార్, చంద్రాల సర్పంచ్ కె.అర్జునరావు,ఉపసర్పచ్ నందం శ్రీను, కార్యదర్శి చాపరాల రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

అధిక కట్నం కోసం వేధింపులు

గుడివాడ, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి) : స్థానిక చెంచుపేటకు చెందిన బొడ్డు కొండాలమ్మకు స్థానిక బాపూజీనగర్‌కు చెందిన బొడ్డు అనీల్‌తో 2018లో వివాహమైంది. ఇటీవల అధిక కట్నం తేవాలని, అనుమానంతో తనను వేధిస్తున్నాడని భార్య కొండాలమ్మ వన్ టౌన్ పోలీసులను ఆశ్రయించింది. ఇప్పటికే రెండుపర్యాయాలు కౌన్సిలింగ్ నిర్వహించగా భార్యభర్తల నడుమ సఖ్యత కుదరలేదు. దీంతో మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు వన్‌టౌన్ ఏఎస్ఐ హెచ్.నరసింహారావు తెలిపారు.


ఉచిత మజ్జిగ పంపిణీ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న రాంబాబు

బాటసారులకు మజ్జిగ పంపిణీ

గుడివాడ, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి) : స్థానిక మార్కెట్ సెంటర్‌లో శ్రీసాయి నాయీ బ్రాహ్మణ సంక్షేమ సేవాసంఘం ఆధ్వర్యంలో సంఘ సభ్యులు గుండిమెడ రఘు వితరణతో ఏర్పాటు చేసిన ఉచిత మజ్జిగ పంపిణీ కేంద్రాన్ని టీడీపీ పట్టణ అధ్యక్షులు దింట్యాల రాంబాబు మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సంఘం నియోజకవర్గ అధ్యక్షులు దేవరపల్లి కోటి, ప్రధాన కార్యదర్శి దుర్గారావు, కోశాధికారి వికృతి సత్యం, గౌరవాధ్యక్షులు పోతురాజు, గౌరవ సలహాదారులు పాతూరు నాని, శ్రీకాంత్, మాణిక్యాలరావు, రాముడు, రాఘవులు, మణికంఠ, కృష్ణ, మోహన్, నాగేశ్వరరావు, త్రినాథ్, మురళీ పాల్గొన్నారు.

అలంకారప్రాయంగా ప్రభుత్వాస్పత్రులు

● కనీస మౌలిక సదుపాయాల కొరత ● పట్టించుకోని అధికారులు

(ఆంధ్రజ్యోతి -నందివాడ, గుడివాడరూరల్): మండలంలో ప్రభుత్వాసుపత్రుల్లో కనీస మౌలిక సదుపాయలు లేక అలంకారప్రాయంగా ఉన్నాయి.

వెంకటాపురం, రుద్రపాక గ్రామాల్లో రెండు ప్రభుత్వాసుపత్రులు ఉన్నాయి. వెంకట రామాపురం ప్రభుత్వాసుపత్రిలో గర్భిణుకు డెలివరీలు వైద్య సదుపాయాలు కల్పిస్తున్నారు. డాక్టర్లు మాత్రం ఏదైనా సీరియస్ పేషంట్లు వస్తే గుడివాడ పంపిస్తున్నారు. రుద్రపాకలో మాత్రం పేరుకు మాత్రం 24 గంటలు ఆస్పత్రి పనిచేస్తుంది. ఆస్పత్రిలో ఇక్కడ టెయిలెట్లు బూత్ రూమ్‌లు లేవు. గర్భిణీ కాన్పులకు రూమ్‌లు లేవు. పడక మంచాలు లేవు. ఆపరేషన్ థియేటర్ లేదు. గత 7 సంవత్సరాల నాడు ఆస్పత్రి వెనుక భాగం పడగొట్టి కొత్త హాస్పటల్ నిర్మిస్తామంటూ వెనుక భాగం మొత్తం పడగొట్టి మట్టిని సైతం నాలుగు అడుగుల లోతు తవ్వి అమ్ముకుంటున్నారు. ఆ ప్రాంతంలో అడుగు భాగం పూడ్చి పిల్లర్లపై చువ్వలు అట్లాగే వదిలేశారు. ముళ్ల కంచెలు

ఆపరేషన్ థియేటర్ లేదు

మేము ప్రజలకు వైద్యం అందించాలన్నా ఇక్కడ ఆపరేషన్ థియేటర్ లేదు. డెలివరీ రూమ్‌లు కూడా లేవు. ప్రస్తుతానికి ఆరు బెడ్లు ఉపయోగించి రోగులకు సెలైన్స్ ఎక్కిస్తున్నాం.

డాక్టర్ సాయి కిరణ్ , రుద్రపాక


రుద్రపాకలో మధ్యలోనే నిలిచిపోయిన కొత్త ఆసుపత్రి నిర్మాణ పనులు

చువ్వలు తుప్పు పట్టి పోతున్నా సంబంధిత అధికారులు మాత్రం ఈ హాస్పటల్ వంక కన్నెత్తి చూడరని చుట్టూ పక్కల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం ఆస్పత్రిలో మైనర్ రిపేర్లు సైతం నోచుకోకుండా దీనావస్థలో ఉంది. ఈ ఆస్పత్రి ఊరికి చివరన ఉండటంతో చీకటి పడితే ఆస్పత్రి సిబ్బంది భయం భయంగా గడుపుతున్నారు. జిల్లా కలెక్టర్ రుద్రపాక ప్రభుత్వ హాస్పటల్‌పై ప్రత్యేక శ్రద్ధ చూపి హాస్పటల్‌కు కావాల్సిన వసతులు ఏర్పాటు చేయాలని రుద్రపాక , చుట్టూ ప్రక్కల గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



గుడివాడ రూరల్‌లోని మోటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

గుడివాడ రూరల్ : మోటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కిందిస్థాయి సిబ్బంది కొరత తీవ్రంగా ఉంది. సిబ్బంది కొరత వల్ల కాంట్రాక్టర్ బేసిక్ మీద సిబ్బందిని నియమించుకున్నారు. చుట్టూ ప్రహరీ లేకపోవటం వల్ల వైద్య సిబ్బంది, రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఊరి చివర ఉండటంతో ఎవరు వచ్చి వెళ్తున్నారో తెలియటం లేదు. ఆరోగ్య కేంద్రంలో సరిపడా మందులు సరఫరా చేసి రోగుల అందించాలని రోగులు కోరుతున్నారు.

కార్యకర్తలకు అండగా టీడీపీ

తోట్లవల్లూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : తోట్లవల్లూరు దళితవాడలో ఇటీవల అనారోగ్యంతో మరణించిన కొడాలి మమతాదేవి కుటుంబానికి మండల టీడీపీ అధ్యక్షుడు వీరపనేని శివరామ్ ప్రసాద్ అండగా నిలిచారు. శివరామ్‌ప్రసాద్ పంపిన రూ 10 వేల సహాయాన్ని మంగళవారం స్థానిక టీడీపీ దళితనేత వల్లూరు సుదర్శనరావు చేతుల మీదుగా మమతాదేవి తల్లి చంటికి అందించారు.


ఆర్థిక సాయం అందజేస్తున్న టీడీపీ నేత సుదర్శనరావు

దివ్యాంగులకు భోజన వసతి

గుడివాడ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : స్థానిక కేటీఆర్ కళాశాల రోడ్డులోని శిరీష రిహాబిలిటేషన్ సెంటర్‌లో శ్రీకృష్ణ యాదవ సేవాసంఘం ఆధ్వర్యంలో తమిరిశ గ్రామానికి చెందిన పట్నాల తరుణ్, రమ్యశ్రీ దంపతుల కుమార్తె ఆద్యశ్రీ ప్రథమ పుట్టినరోజు సందర్భంగా మంగళవారం దివ్యాంగులకు భోజనవసతి కల్పించారు. ఈ కార్యక్రమంలో సేవాసంఘం రాష్ట్ర అధ్యక్షులు పుట్టి హరికుమార్, పట్నాల సురేష్, సరళ, రెడ్డి శ్రీనివాసరావు, రెడ్డి ఇందుమతి, ఆలుగోజీ సీతమ్మ, తిరుపతయ్య, తాతారావు, తదితరులు పాల్గొన్నారు.


దివ్యాంగులకు భోజనవసతి కల్పిస్తున్న పట్నాల తరుణ్, రమ్యశ్రీ దంపతులు

పేదలకు విద్య, వైద్యసేవలే కూటమి లక్ష్యం

● ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా

పామర్రు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : పేద ప్రజలకు విద్య, వైద్యసేవలు అందించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. నియోజకవర్గ కేంద్రమైన పామర్రులో ప్రభుత్వం మంజూరు చేసిన నాబార్డు నిధులు రూ.6కోట్లతో నిర్మితమయ్యే సీహెచ్‌సీ (సామాజికకమ్యూనిటీ ఆరోగ్యకేంద్రం 30పడకల ఆసుపత్రి) నూతన భవన నిర్మాణానికి మంగళవారం ఆయన భూమిపూజ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నిరుపేద కుటుంబాలు ప్రభుత్వ వైద్యం అందక ఇబ్బందులు పడకుండా ఉండాలనే సంకల్పంతో ప్రతినియోజకవర్గంలో 30పడకల సూపర్ స్పెషలిటి ఆసుపత్రిని నిర్మించేందుకు భూమి చేశామన్నారు. పామర్రు పరిసర ప్రాంత ప్రజలకు కార్పొరేట్ వైద్యం అందిచేలా అత్యంత ఆధునిక సదుపాయాలతో సర్వంగా సుందరంగా ఆసుపత్రి నూతన భవన నిర్మాణాన్ని కేవలం తొమ్మిదినెలల్లో పూర్తిగావించే రీతీలో అవసరమైన ప్రణాళికలు రూపోందించామన్నారు. పామర్రు, మొవ్వ మండలాల్లో ఎస్సీ విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం రూ. 6కోట్లతో రెండు సంక్షేమ వసతిగృహాల నిర్మాణాలకు భూమిపూజలు నిర్వహించనున్నామన్నా రు. వాటినీ తొమ్మిదినెలల్లో పూర్తిచేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా కమ్యూనిటీ వైద్యాధికారి డాక్టర్ శేషుకుమార్, కృష్ణాడెల్టా ప్రాజెక్టుకమిటీ వైస్‌చైర్మన్ వల్లూరిపల్లి గణేష్, మండల టీడీపీ అధ్యక్షుడు కుదరవల్లి ప్రవీణ్‌చంద్ర, పామర్రు సీహెచ్‌సీ వైద్యాధికారి పిసుదేష్‌బాబు, నాగేశ్వరరావు, డాక్టర్ సుధ, ఇతరవైద్యాధికారులు, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు,సిబ్బంది పాల్గొన్నారు.


భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే వర్లకుమార్‌రాజా

మట్టి నమూనా కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

● ఏడీఏ నిమ్మగడ్డ రమాదేవి

గుడివాడ రూరల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): గుడివాడ వ్యవసాయ డివిజన్‌లో ప్రతి వీఏఏలు, మండల వ్యవసాయాధికారులు మట్టి నమూనాల లక్ష్యాలను త్వరగా పూర్తి చేయాలని ఏడీఏ నిమ్మగడ్డ రమాదేవి అన్నారు. మంగళవారం ఏడీఏ కార్యాలయంలో గుడివాడ, పెదపారుపూడి, నందివాడ మండలాల వ్యవసాయాధికారులు, వీఏఏల సమావేశం ఏడీఏ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలాల్లో ప్రతి గ్రామంలో కొంతమంది రైతుల పొలాలకు వెళ్లి మట్టి నమూనా ఖచ్చితంగా తీయాలన్నారు. ఆ రైతు మట్టి నమూనా తీసేటప్పుడు ఆ రైతు ఫొటోతో మట్టి నమూనా తీస్తున్నట్లు జియో ట్యాగింగ్ చేయాలన్నారు. ఆ రైతు అందుబాటులో లేకపోతే రైతు సూచించిన వ్యక్తి దగ్గరతో ఫొటోలు తీసి జియో ట్యాగింగ్ చేసి మట్టి నమూనా తీసుకోవాలన్నారు. ఆ మట్టి నమూనాను నాలుగు విడుతలుగా చేసి మండల వ్యవసాయాధికారులకు పంపాలన్నారు. పేరు, గ్రామం, ఎన్ని ఎకరాల విస్తీర్ణంలో తీసింది వివరాలన్ని మట్టి నమూనా కేంద్రం బ్యాగ్‌లో రాయాలన్నారు. ప్రతి రైతుకూ నమూనా తీయటం వల్ల కలిగే లాభాలు, ప్రయోజనాలు వివరించాలని కోరారు. మట్టి నమూనాలు సరిగా తీస్తున్నది, లేనిది మూడవ పార్టీ ఎంక్వేరీ ఉంటుందన్నారు. వ్యవసాయ శాఖ సిబ్బంది సక్రమంగా నిర్వహించలేదని వస్తే వారిపై తగు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి మండలంలో నిర్దేశించిన లక్ష్యాలు నమూనా కేంద్రాలకు అందించాలని తెలిపారు. గుడివాడ మండల ఏవో బోలెం అనంతలక్ష్మి, పెదపారుపూడి వ్యవసాయాధికారి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ నిమ్మగడ్డ రమాదేవి

టీడీపీ నేత జన్మదినోత్సవం

గుడ్లవల్లేరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : మండల టీడీపీ అధ్యక్షుడు కొసరాజు బాపయ్యచౌదరి జన్మదిన వేడుకలు మండల టీడీపీ కార్యాలయం వెంకటరామకృష్ణా రైస్‌మిల్ ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. బాపయ్య చౌదరి విదేశీపర్యటన నిమిత్తం అమెరికా వెళ్లిన నేపథ్యంలో పార్టీ నాయకులు, అభిమానులు పార్టీ కార్యలయం వద్ద భారీకేక్‌ను ఏర్పాటుచేసి కట్‌చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా గుడివాడ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వల్లభనేని వెంకటరావు కేక్ కట్‌చేశారు. కార్యక్రమంలో గుడ్లవల్లేరు మార్కెట్ కమిటీ చైర్మన్ పొట్లూరి రవికుమర్, జంగం మోహనరావు,ఎ.రామ్మోహనరావు(చంద్రాల చిట్టిబాబు), పళ్ళెం నరసింహారావు, నాగూర్,జాని,గుడ్లవల్లేరు మాజీసర్పంచ్ వల్లభనేని వెంకటసుబ్బారావు చౌదరి, పోలవరపు వెంకటరావు, బొర్రా ప్రసాద్, మాదాసు ప్రసాద్, కొసరాజు ఉపేంద్ర, మురాల నరేష్, బొర్రా నాగేశ్వరరావు, గంటయ్య, ఈడే కృష్ణ, జూపూడి నాగబూషణం, రంగబాబు, సత్తార్, దివ్యాచౌదరి, శశికళ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పమిడిముక్కల మండల అధ్యక్షుడి ఎన్నిక



పమిడిముక్కల, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : పమిడిముక్కల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా కృష్ణాపురానికి చెందిన కాగిత సోమేశ్వరరావు నియమితు లయ్యారు. సోమేశ్వరరాను మండల పార్టీ అధ్యక్షుడిగా నియమిస్తూ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు గొల్లు కృష్ణ నియామకపత్రం అందజేశారు. మూడోసారి తనను మండలపార్టీ అధ్యక్షుడుగా నియమించడం పట్ల అఖిల భారత కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే, పార్టీ పార్లమెంట్ కమిటీ అధ్య క్షురాలు సోనియాగాంధీ, పార్లమెంట్‌లో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, ఏపీ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు షర్మిల, జిల్లా అధ్యక్షుడు గొల్లు కృష్ణకు సోమేశ్వరరావు కృతజ్ఞతలు తెలిపారు.

నిరుద్యోగులకు ఉపాధి కల్పనే ధ్యేయం

● టీడీపీ పట్టణ అధ్యక్షుడు రాంబాబు

గుడివాడ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలోని యువత, నిరుద్యోగులు, మహిళలకు ఉద్యోగ అవకాశాలను కల్పించేందుకు ప్రాధాన్యతనిస్తూ ఎమ్మె ల్యే వెనిగండ్ల రాము కృషి చేస్తున్నారని టీడీపీ పట్టణ అధ్యక్షులు దింట్యాల రాంబాబు అన్నారు. మంగళవారం స్థానిక కైకాల కళామందిరంలో తన్వి ఫుడ్స్ ఇండియా లిమిటెడ్ ఆధ్వర్యంలో మహిళలకు ప్రత్యేకంగా జాబ్‌మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా తన్వి ఫుడ్స్ జనరల్ మేనేజర్ గంగాచారి మాట్లాడుతూ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము విజ్ఞప్తి మేరకు గుడివాడలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నామన్నారు. మేళా ద్వారా కనీసం 100మందికి ఉద్యోగ అవకాశాలను కల్పించనున్నామన్నారు. పలువురు మహిళలకు నియాకపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణాధ్యక్షులు డి.రాంబాబు, తన్వి ఫుడ్స్ ప్రొడక్షన్ హెడ్ బాలాజీ, ఫెసిలిటీ మేనేజర్ దుర్గప్రసాద్, టీడీపీ నాయకులు చేకూరు జగన్మోహనరావు, పంద్రాజు సాంబశివరావు, సయ్యద్ జబీన్ తదితరులు పాల్గొన్నారు.


జాబ్‌మేళాలో పాల్గొన్న టీడీపీ నాయకులు, తన్విఫుడ్స్ కంపెనీ ప్రతినిధులు

కేవీ డ్రెయిన్ పూడికతీత పనులు ప్రారంభం

గుడ్లవల్లేరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : గుడ్లవల్లేరులోని కేవీ డ్రెయిన్ పూడికతీత పనులకు రూ. 70 లక్షలు నిధులు మంజూరయ్యాయి. ఈ పనులను మంగళవారం జీరో బై జీరో చినగొన్నూరు సమీపంలో పనులను జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ రాష్ట్ర టీడీపీ కార్యదర్శి సాయిన పుష్పావతి పూజలు నిర్వహించి ప్రారంభించారు. పనులను నాణ్యతతో నిర్వహించి రైతులకు ఉపయోగపడేలా పనులు చేయాలని ఆమె సూచించారు. రైతుల కష్టం తెలిసిన చంద్రబాబు,గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాములు నిధులు మంజూరు చేసి వర్షాకాలంలో పంటలు మునగకుండా వేసవిలోనే పనులకు నిధులు మంజూరు చేయించారని ఆమె కొనియాడారు. కూరాడ,శేరిదగ్గుమిల్లి,విన్నకోట,చింతలగుంట,తాడిచర్ల,పురిటిపాడు,చినగొన్నూరు గ్రామాల రైతులకు ఈ డ్రైన్ పూడిక తీత ఎంతో మేలు చేయనుందని అన్నారు.కార్యక్రమంలో నీటి సంఘం అధ్యక్షులు సాయిన వీరసూర్య ప్రసాద్,డ్రైనేజీ ఏఈ భూపేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


కేవీ డ్రెయిన్ పనులను ప్రారంభించిన పుష్పావతి

ఎంబీఏ విద్యార్థుల పారిశ్రామిక సందర్శన

గుడివాడ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఏఎన్ఆర్ కళాశాల ఎంబీఏ విద్యార్థులు మంగళవారం ఏలూరుజిల్లా, మండవల్లి మండలం పెరికెగూడెంలోని వెన్నర్ సిరామిక్స్ లిమిటెడ్‌కు పారిశ్రామిక సందర్శనకు వెళ్లారు. ఈ సందర్భంగా సంస్థ సీనియర్ మేనేజర్ వేదాంతం శ్రీనివాస్ మాట్లాడుతూ పరిశ్రమల నిర్వహణలో ప్రత్యక్ష జ్ఞానం సంపాదించడం వల్ల విద్యార్థులు వృత్తి నైపుణ్యాలను పెంపొందించుకుంటారన్నారు. సంస్థ సీనియర్ హెచ్.ఆర్ హెడ్ ఎం.బసవ టైల్స్ తయారీ, ప్యాకింగ్, అమ్మకాలు గురించి విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల పాలకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు ఎల్ఆర్‌కే ప్రసాద్, కె.ఎస్ అప్పారావు, ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జె.ఎస్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ బి.ఎస్.ఎస్ పద్మజ, ఎంబీఏ విభాగాధిపతి డాక్టర్ సువర్చల, అధ్యాపకులు సలీం, విజయకుమారి, విద్యార్థులు పాల్గొన్నారు.



పారిశ్రామిక సందర్శనకు వెళ్లిన ఏఎన్ఆర్ ఎంబీఏ విద్యార్థులు

ఎస్సీ వర్గీకరణ బిల్లును ఆమోదింపజేయాలి

గుడివాడ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణలో ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదం పొందిందని, ఏపీలోను బి ల్లును ఆమోదింపజేసి రిజర్వేషన్‌ను అమల్లేయాలని ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర నాయకులు కంచర్ల సుధాకర్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక గుడ్‌మెన్‌పేటలోని ఆయన స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి(ఎంఆర్‌పీఎస్) రాష్ట్ర అధ్యక్షులు దండు వీరయ్యమాదిగ పిలుపుమేరకు విద్యాసంవత్సరం ప్రారంభం కాకమునుపే బిల్లును ఆమోదింపజేసి, మాదిగ, మాదిగ ఉపకులాలకు రిజర్వేషన్‌లను కేటాయించాలన్నారు. ఎస్సీ కార్పొరేషన్ రుణాల మంజూరు ప్రభుత్వం సిద్ధపడిందని, కులవృత్తిదారులకు ఎటువంటి రుణాలను కేటాయించకపోవడం బాధాకరమన్నారు. ఈ సమావేశంలో ఎంఆర్‌పీఎస్ నాయకులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కంచర్ల సుధాకర్

పది ఎకరాల వరి గడ్డివామి దగ్ధం

కూచిపూడి: కోసూరులో ఉప్పాల వెంకటేశ్వరరావుకు చెందిన పది ఎకరాల వరి గడ్డి వామి సోమవారం అర్థరాత్రి జరిగిన ప్రమాదంలో అగ్నికి ఆహుతి అయింది. దీంతో లక్ష రూపాయల మేర ఆస్తి నష్టం సంభవించింది. సమాచారం అందుకున్న వెంటనే మొవ్వ అగ్నిమాపక అధికారి వెంకటేశ్వరరావు నేతృత్వంలోని సిబ్బంది మంటలు అదుపులోకి తెచ్చారు.

చిన్నారులకు పౌష్టికాహారం అందించడమే లక్ష్యం


అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ శివనాగమణి

పెదపారుపూడి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): అంగన్వాడీ చిన్నారులకు పౌష్టికాహారం అందించడమే లక్ష్యమని అంగన్వాడీ సూపర్‌వైజర్లు ఎం.శివనాగమణి , అరుణ కుమారిలు పేర్కొన్నారు. కోర్నిపాడు, దూళ్లవానిగూడెం గ్రామాల్లోని అంగన్వాడీల్లో పోషకాహార పక్షోత్సవాలను మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి వారు మాట్లాడుతూ 1000 రోజుల కేర్ అనగా గర్భం దాల్చినప్పటి నుంచి బిడ్డ పుట్టిన రెండు సంవత్సరాల వరకు తీసుకోనే జాగ్రత్తల గురించి వివరించారు. అంతే కాక పిల్లలను అంగన్‌వాడీ కేంద్రానికి తీసుకువచ్చి ప్రతీ నెలా ఎత్తు బరువు తీయించాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళా పోలీసు, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు,పాల్గొన్నారు.

తోట్లవల్లూరు : గరికపర్రు అంగన్‌వాడీ కేంద్రం-3లో మంగళవారం పోషణ్ పక్వాడ్ పక్షోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. ఐసిడిఎస్ సూపర్‌వైజర్ నాగమల్లేశ్వరి, అంగన్‌వాడీ కార్యకర్తలు లావణ్య, రమా, రాధిక, కనకదుర్గ, విజయలక్ష్మీ గర్భిణిలకు, తల్లులకు పోషకాహారంపై చార్ట్‌ల ద్వారా అవగాహన కల్పించారు. ముఖ్యంగా పుట్టిన వెంటనే బిడ్డకు ముర్రుపాలు తాగించాలని వివరించారు. పుట్టిన బిడ్డకు మొదటి వెయ్యి రోజుల వరకు పోషకాహారం అందిస్తే జీవితంలో చక్కని ఆరోగ్యంతో ఉంటారని సూపర్‌వైజర్ నాగమల్లేశ్వరి వివరించారు.

పామర్రు : అంగన్వాడి కేంద్రాలద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పథకాలను అర్హులైన వారంతా సద్వినియోగం చేసుకోవాలని పామర్రు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయకుమారి అన్నారు. మండల పరిధిలోని పెదమద్దాలి అంగన్వాడి కేంద్రంలో మంగళవారం జరిగిన పోషణ్ పక్వాడా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఆరోగ్య వంతమైన సమాజ నిర్మాణసాధన కోసం ప్రతిష్టాత్మకంగా అమల్జేస్తున్న పథకాల పట్ల ప్రజల్లో చైతన్యంతీసుకురావాలన్నారు.సూక్ష్మపోషకాలు గల ఆహారం తీసుకునే విధంగా గర్భవతులను, చిన్నారుల తల్లులను పోత్సహించే బాధ్యత ప్రతి అంగన్వాడి కార్యకర్తలదేనన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లు కోడాలి ఉమారాణి, అరుణ, తదితరులు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ నాగమల్లేశ్వరి


మొవ్వలో అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది


గుడివాడలో విన్యాసాలు చేస్తున్న అగ్నిమాపకశాఖ అధికారులు

అగ్నిప్రమాదాలపై అప్రమత్తత తప్పనిసరి

కూచిపూడి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా రెండో రోజైన మంగళవారం కూచిపూడి, మొవ్వ బస్ స్టేషన్లలోనూ, మొవ్వ జేజే నగర్‌లో అగ్నిప్రమాదాలపై సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రమాదాలు జరుగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రమాదాలు సంభవించినప్పుడు ఆస్తి, ప్రాణ నష్టం నివారణకు తీసుకోవాల్సిన చర్యల గురించి, మంటలు ఆర్పే పద్ధతుల గురించి డెమో చేసి చూపించారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక అధికారి కె.వెంకటేశ్వరరావు, ఎల్.వెంగళరావు, ఏ.వి.పూర్ణచంద్రరావు, శ్రీనివాసరావు, ప్రసాద్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

గుడివాడ : అగ్నిప్రమాదాలను ఎలా నియంత్రించాలో అగ్నిమాపక సిబ్బంది క్షేత్రస్థాయిలో చేసి చూపించారు. స్థానిక ఆర్టీసీ బస్టాండు, గ్యారేజ్‌లలో అగ్నిప్రమాద నివారణ విన్యాసాలు, రైల్వేస్టేషన్‌లో రైలుబండిలో ప్రయాణీకులకు కరపత్రాలను మంగళవారం పంపిణీ చేశారు. అగ్నిమాపక శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్) కోసం సంప్రదించాల్సిన నెంబర్లు
✆ 99854 09737, 99854 11610

ఆంధ్రజ్యోతి దినపత్రిక కావాల్సిన వారు ఈ క్రింది నెంబర్లను సంప్రదించగలరు
✆ సర్క్యులేషన్ మేనేజర్ 9985411604,
డీజీఎం : 9885821929, జీఎం : 99854 11234